
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 26 నవంబరు 2024





నందివెలుగు-కొల్లిపర మధ్య చేలల్లో యంత్రాలతో కోతకోసి, ప్లాట్ల రోడ్లపై ఆరబోసుకున్న రైతులు

- వైసీపీ సర్కారులో పట్టిన గ్రహణం నుంచి విముక్తి
- మారుమూల ప్రాంతాల్లో సైతం మరమ్మతు పనులు
- ఉమ్మడి జిల్లాకు భారీగా నిధులు మంజూరు



రేపల్లె : బేతపూడిలో సీసీరోడ్డు నిర్మాణ నాణ్యతను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఏఈ

రహదారులకు మహర్దశ



బాపట్లలో శరవేగంగా జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు రహదారులను ఆవరించిన గ్రహణం ఎట్టకేలకు వీడుతున్నది. రహదారుల మరమ్మతులు, నిర్వహణ, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రహదారుల మరమ్మతు, విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే మూడుజిల్లాల్లో ప్యాచ్ వర్కులు, తక్షణ మరమ్మతుల కోసం గత నెలలో రూ. 35 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, తాజాగా రహదారుల అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేసింది.

గుంటూరు జిల్లాకు రూ. 559.84 కోట్లు

విభజిత గుంటూరు జిల్లాలో రహదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని రహదారులు, వంతెనల నిర్మాణం, అభివృద్ధి కోసం 559.84 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లాలో 719 కిలోమీటర్ల మేర రహదారుల్లో మరమ్మతులు చేస్తారు. గుంతలు పూడ్చి రోడ్లు వేస్తారు. వాటితోపాటు ఆగిపోయిన ఆర్వోబీలు, వంతెనలు నిర్మించడానికి కూడా నిధులు కేటాయించారు. ఎండీఆర్ ప్లాన్ కింద జిల్లాలోని 3 రహదారుల్లో 15.6 కి.మీ మేర రోడ్లు వేయనున్నారు. ఇతర జిల్లాలను కలిపే 4 రోడ్లలో 18.4 కి.మీ మేర రోడ్లు వేస్తున్నారు. సీఆర్ఎఫ్ నిధుల కింద 3 రోడ్లలో 14.75 కి.మీ మేర రోడ్లు వేస్తున్నారు. కాగా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ఫేజ్- 1 కింద 262.64 కోట్లతో జిల్లాలోని 13 రోడ్లు 94.11 కి.మీ మేర నిర్మిచనున్నారు. బాగా దెబ్బతిన్న 12 రోడ్లలో 69.84 కి.మీ మేర మరమ్మతులు చేపట్టగా, 50 రోడ్లకు సంబంధించి 222 కి.మీ మేర తక్షణ మరమ్మతులు, ప్యాచ్ వర్కులు చేపట్టనున్నారు. ఇంటెన్సివ్ ప్యాచ్ వర్కుల కింద 19 రోడ్లలో 107.79కి.మీ మేర, అంచులు తెగిన రోడ్ల ప్యాచ్ వర్కులు, జంగిల్ క్లియరెన్స్ కింద 33 రోడ్లలో 176.63 కి.మీ మేర రహదారి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటితోపాటు హనుమాన్‌పాలెం వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి రూ. 28 కోట్లు కేటాయించారు. కొండవీడు ఘాట్ రోడ్డుకు 6.8 కోట్లు కేటాయించారు. వెనిగండ్ల- జొన్నలగడ్డ రోడ్డు, గుంటూరు- నిడమర్రు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గుంటూరు- బాపట్ల- చీరాల రోడ్డు, గుంటూరు- ఫిరంగిపురం రోడ్డు, ఎయిమ్స్ గేటు నుంచి ఎన్‌హెచ్- 16 వరకూ అప్రోచ్ రోడ్డుల నిర్మాణానికి మోక్షం లభించింది. మంగళగిరి-

(మిగతా 8వ పేజీలో..)

- ధాన్యం తేమ సాకుతో రైతు నిలువు దోపిడీ
- వాతావరణ మార్పులతో రైతుల్లో భయం... భయం
- యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమ శాతం 19 నుంచి 21 వరకు
- ప్రభుత్వం ఇచ్చిన పరిమితి 17 శాతం
- అదనపు తేమ శాతాలు చూపి ఎదురు వసూలు చేస్తున్న మిల్లర్లు
- బస్తాకు రూ. 200 నుంచి రూ.300 కడితేనే ధాన్యం కొనేది!
- ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 1740
- బయటి మార్కెట్‌లో ధర రూ.1300 నుంచి రూ.1400 వరకు

తేమ సాకు.. రైతుకు షాకు





ధాన్యం తేమ శాతాన్ని అంచనా వేస్తున్న పరికరం

తెనాలి, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమై ఎప్పుడు వర్షం పడుతుందోనన్న భయం... ఆరుగాలం పండించిన ధాన్యం ఎక్కడ వర్షానికి తడిచిపోయోనన్న ఆందోళనతో యంత్రాలతోనే వరి కోతకు ప్రాధాన్యం ఇస్తున్నారు డెల్టాలోని రైతులు. అయితే కోత కోసిన ధాన్యాన్ని వెంటనే అమ్మకుండా ఆరబెట్టి, తేమ తగ్గాకే అమ్మకాలు చేస్తారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో రైతులు ఆరబెడితే ఎక్కడ తడిచిపోయి అసలుకే నష్టం వస్తుందన్న భయంతో అమ్మటానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వీరి భయాన్ని, వాతావరణ ప్రతికూలతను మిల్లర్లు వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. రైతులను నిలవు దోపిడీ చేసేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు అనేక మార్గాలను మార్కెటింగ్ కోసం ప్రవేశపెడితే, అవేమీ రైతులకు అక్కరకు రావటంలేదు. కృష్ణా డెల్టాలో 2024 ఖరీఫ్ పంట వచ్చేసింది. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో ఉన్న కోతలు మొదలుపెట్టేశారు. అయితే ధాన్యం అమ్ముకోటానికి గతంలోలాగా ఆర్ఎస్‌కేల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వాట్సప్‌లో హాయ్ అని పెడితేచాలు... ధాన్యం అమ్మేసుకునేలా మార్పులు కూడా చేశారు. ఇదంతా బాగానే ఉంది. అయితే ఈ తతంగం మొత్తం పూర్తయిన తర్వాత వెళ్లాల్సింది మిల్లర్ల దగ్గరకే కావటంతో వారి దగ్గర దోపిడీకి మాత్రం తెరపడలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కృష్ణా పశ్చిమ డెల్టా కింద గుంటూరు జిల్లా పరిధిలో 1,84,190 ఎకరాలు, బాపట్ల జిల్లా పరిధిలో 3,79,997 ఎకరాలు, ప్రకాశం జిల్లా పరిధిలో 7,164 ఎకారలలో ఖరీఫ్ వరి సాగవుతోంది. వీటిలో ఒక్క ప్రకాశం జిల్లాలో, బాపట్ల జిల్లాలోని తీర మండలాల్లో కొన్నిచోట్ల మినహాయించితే, మిగిలిన విస్తీర్ణం మొత్తం వరి కోతకు సిద్ధమైంది. తెనాలి, కొల్లిపర, మంగళగిరి, దుగ్గిరాల, పెదకాకాని, గుంటూరు, పొన్నూరు, బాపట్ల జిల్లా పరిధిలో కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, రేపల్లె, మరికొన్ని మండలాల్లో వరి కోతలు మొదలయ్యాయి. మనుషులతో కోత కోయించే రైతులు మాత్రం వరుణుడిపై భారం వేసి, కుప్పలు వేసేందుకు వరి ఓదెలను చేలపైనే ఆరేవరకు ఉంచేస్తున్నారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో, వరి కోత కోసేందుకు, కుప్పలు వేసేందుకు కూలీలు రేట్లు పెంచేశారు. వీరిపరిస్థితి అటుంచితే, 70 శాతం మంది రైతులు యంత్రాలతోనే కోతకోసి, అమ్మేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తడిచిపోతే తర్వాత రేటు రాదని, పండించిన పంట దక్కకుండా పోతుందనే ఆందోళనతో కోత, కుప్ప, నూర్పిళ్లతో పని లేకుండా ఒకేసారి వరికోత యంత్రం సాయంతో కోసేసి, ధాన్యం అమ్ముకుంటున్నారు. అయితే యంత్రాల సాయంతో కోత కోసినప్పుడు ధాన్యంలో తేమ శాతం 19 నుంచి 21 వరకు ఉంటోంది. అదే వాతావరణం బాగుంటే తేమ తగ్గేవరకు ఆరబెట్టి అమ్ముకునేవారు. అయితే వరుణుడి

(మిగతా 6వ పేజీలో..)

రెట్టింపు తేమ శాతం వసూలు చేస్తున్నారు

సాధారణంగా తేమ ఉన్న ధాన్యం ఆరబెడితే, ప్రతి పది బస్తాలకు ఒక బస్తా వ్యత్యాసం ఉంటుంది. ఉదాహరణకు ఒక రైతు 100 బస్తాల ధాన్యం మిల్లర్‌కు వేశారనుకుంటే, దీనిలో తేమ వల్ల తరుగు 10 బస్తాలు ఉండొచ్చు. అంటే ప్రభుత్వ ధర ప్రకారం రూ. 17,400 మిల్లర్‌కు నష్టం వచ్చే మాట వాస్తవమే. అయితే 100 బస్తాలకు రూ. 300 చొప్పున ఎదురు వసూలు చేస్తుండటంతో అన్ని బస్తాలపైనా రూ. 30వేలపైనే మిల్లర్‌లకు రైతు ఎదురు కట్టాల్సి వస్తోంది. అంటే దాదాపు రెట్టింపు రేటును తేమ శాతం సాకుగా చూపి రైతు నుంచి ముందే దోచేస్తున్నారు. అదే తేమ శాతాన్ని బట్టి ఒక శ్లాబ్ రేటును ప్రభుత్వమే నిర్ణయిస్తే అంత నష్టం ఉడదనేది రైతుల మాట.

ప్రభుత్వమే రేటు నిర్ణయించాలి

ధాన్యం కొనుగోలుకు సంబంధించి తేమ శాతం 17 వరకు, మట్టి, రాళ్లు, తాలు గింజల వంటివి ఇతర వ్యర్థాలు 1 శాతం వరకు ఉండొచ్చని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. చెడిపోవటం, రంగు మారటం, మొకలు వంటివి ఉన్న ధాన్యమయితే 5 శాతం, పక్వతలేని, ముడుచుకుపోయిన గింజలు 3 శాతం, ఏ గ్రేడ్ రకంలో తక్కువ రకం కానీ, కేళీలు 3 శాతం వరకు ఉండొచ్చని సూచించింది. అయితే ప్రస్తుతం తేమ శాతం సమస్యగా మారింది. 17 శాతం లోపు తేమ ఉంటే, ఎ గ్రేడ్ రకానికి రూ. 1740 చెల్లిస్తారు. అయితే ఆపై తేమ శాతం ఉన్నవాటికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం వాతావరణం ఇబ్బందికరంగా ఉన్న తరుణంలో తేమ ఉన్న ధాన్యాన్ని అమ్మక తప్పదని, ప్రభుత్వ కొనకపోతే చివరకు దళారులకైనా తెగనమ్మక తప్పదని రైతులు చెబుతున్నారు. అయితే 17 శాతానికి మించిన అదనపు శాతాలకు 21 శాతం వరకు ప్రభుత్వమే ధరలో తరుగుదల నిర్ణయిస్తే, మిల్లర్ల దోపిడీ తగ్గుతుందనేది రైతుల విన్నపం.

ఎన్నికల విధానానికి పాతరేసి సెవన్‌మెన్, త్రీమెన్ కమిటీలంటూ నామినేటెడ్ పదవుల పేరిట పార్టీ శ్రేణులకు పునరావాస కేంద్రాలుగా పీఏసీఎస్(ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ)లను మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది. సొసైటీ రుణాలను ఐదేళ్లలో ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేశారు. వైసీపీ నేతలు చెప్పిన వారికే రుణాలు తప్ప అర్హులైన రైతుల్లో మట్టి కొట్టి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వంలోకి రాగానే తొలుత అక్రమాలపై దృష్టి పెట్టడంతో పాటు సొసైటీలకు ఎన్నికలు కూడా నిర్వహించాలని తలంచింది. కానీ ఈలోపుగా పారదర్శకతతో పాటు జరిగిన అక్రమాలన్నీ వెలుగుచూడాలంటే సొసైటీల్లో ఉన్న సభ్యుల ఖాతాలన్నీ ఆన్‌లైన్ చేయాలనే కీలక నిర్ణయం తీసుకుని అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

‘డిజిటల్’ తో కదులుతున్న.. పరపతి డొంకలు....!

- కొనసాగుతున్న పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ ప్రక్రియ
- మూడు దశల్లో సభ్యుల ఖాతాలన్నీ ఆన్‌లైన్
- దాదాపు పది సొసైటీల్లో సరిపోని పద్దులు గుర్తింపు
- వాటిపై నిర్ణయం పై అధికారుల చేతుల్లోనే...
- రేపటితో ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసే అవకాశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సొసైటీల్లో సభ్యులు తీసుకన్న రుణాల వివరాలతో పాటు ఇక ముందు జరగబోయే లావాదేవీలన్నీ కూడా ఆన్‌లైన్ ద్వారానే జరపడం ద్వారా ఎటువంటి అక్రమాలకు ఆస్కారం అవకాశం లేకుండా ఉంటుందనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ప్రక్రియకు కావాల్సిన నిధుల సహాయం కేంద్ర ప్రభుత్వం నుంచి అందడంతో కంప్యూటరీకరణ పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. గతంలోనే జిల్లాలో సొసైటీ రుణాల మీద అనేక ఆరోపణలు వచ్చాయి. కానీ ప్రస్తుతం జరుగుతున్న డిజిటలైజేషన్‌లో భాగంగా టాలీ కానీ ఖాతాలు కూడా బహిర్గతమవుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ఖాతాలు ఇప్పటి వరకు దాదాపు పది వరకు గుర్తించినట్లు తెలుస్తోంది. వీటి వివరాలను ఇప్పటికే యంత్రాంగం పై అధికారులకు పంపించినట్లు సమాచారం. ఆ ఖాతాల ఆన్‌లైన్ విషయంలో వారి ఆదేశాల మేరకే నడుచు కుంటామని యంత్రాంగం చెబుతోంది

61,000 ఖాతాలు డిజిటలైజేషన్...

జిల్లాలో 112 సొసైటీల పరిధిలో 77,752 రైతుల ఖాతాలు ఉన్నాయి. వీటన్నింటిని ఆన్‌లైన్ చేసే ప్రక్రియ గడచిన పదిహేను రోజులుగా సాగుతుండగా ఇప్పటికీ 61,000 ఖాతాలు ఆన్‌లైన్ అయ్యాయని అధికారులు చెబుతున్నారు. బుధవారం నాటికి మొత్తం ఖాతాలను కంప్యూటరీకరణ చేయడం జరుగుతుందని, అనుమానాస్పద ఖాతాలతో పాటు, పద్దు సరిపోని వాటి విషయంలో పై అధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని యంత్రాం గం చెబుతోంది. జిల్లాలో మొత్తం 112 సొసైటీలు ఉండగా చీరాల, అద్దంకి, పర్చూరు పరిధిలో 68, బాపట్ల, వేమూరు, రేపల్లె కింద 44 పీఏసీఎస్‌లు ఉన్నాయి. డీసీసీబీలు అటు గుంటూరులోనూ, ఇటూ ఒంగోలులోనూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే పీఏసీఎస్‌ల్లో కొనసాగుతున్న త్రీమెన్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి విదితమే. వీరి స్థానంలో ప్రతి సొసైటీకి పర్సన్‌ఇన్‌చార్జిగా ప్రభుత్వ ఉద్యోగినే నియమించింది. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికాగానే అక్రమార్కులపై చర్య లతో పాటు సొసైటీలకు ఎన్నికలు జరిపి కొత్త పాలకవర్గాలను కూట మి ప్రభుత్వం కొలువుదీర్చనుంది

ఆడిట్ నివేదికలనూ తుంగలో తొక్కి.....

ప్రతి ఏడాది సొసైటీల్లో ఆడిట్ చేపట్టడం ఆనవాయితీ. ఆ వివరాలను బహిరంగ పర్చడం ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామనే సంకేతాలను ప్రజలకు పంపించినట్లవుతోంది. కానీ ఐదేళ్ల పాటు ఈ నివేదికలను తొక్కిపెట్టారు తప్పితే బహిర్గతం చేసిన పాపాన పోలేదు. ఈ క్రమంలో నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులపై త్రీమెన్ కమిటీలు వేధింపులకు కూడా తెగబడ్డాయి. నిర్ణీత కాలపరిమితితో సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ వైసీపీ ప్రభుత్వం ఈరెగ్యులర్ విషయంలో అనేక అవకతవకలకు పాల్పడ్డట్లు ఆధారాలతో సహా ఫిర్యాదులు గతంలోనే అందాయి. నిబంధనలకు పాతరేసి తేదీలు మార్చి వారికి కొమ్ముకాసే ఉద్యోగులనే రెగ్యులర్ చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓ వైపు డిజిటల్ ప్రక్రియ సాగుతుండగానే, గతంలో వచ్చిన అనేక ఫిర్యాదులపై అంతర్గతంగా శాఖాపరమైన విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నో అవినీతి తిమింగలాలు బయటపడే అవకాశం ఉంది.

కదులుతున్న పరపతి డొంకలు

సొసైటీ ఖాతాలను ఆన్‌లైన్ చేసే క్రమంలో రుణాలతో పాటు మొత్తం లావాదేవీల విషయంలో పద్దు టాలీ కానీ ఖాతాలు వెలుగులోకి వచ్చా యి. ఇలాంటివి దాదాపు పది వరకు అధికారులు గుర్తించారు. వీటి విషయంలో కొన్ని మార్గద ర్శకాలను గతంలోనే ప్రభుత్వం ఇచ్చి ఉంది. సభ్యుడి ఖాతాకు సంబంధించిన మొత్తంలో ఒక శాతం వరకు ఖాతా విషయంలో పద్దు సరిపోక పోతే అలాంటి వాటి విషయంలో ముందుగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసేయమనే ఆదేశాలు ఉన్నాయి. కానీ ఒక శాతానికి మించి రుణాల విషయంలో అవకతవకలు జరిగినట్లు ఈ ప్రక్రియలో గుర్తించిన ఖాతాలు కూడా పది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ప్రధానంగా నగరం, తుమ్మల సొసైటీలతో పాటు మరో 8 వరకు ఉన్నట్లు సమాచారం. అద్దంకి నియోజక వర్గ పరిధిలోని పంగలూరు మండలం నూజెళ్ల పల్లి సొసైటీలో బంగారం లేకుండానే రైతుల పేరిట వైసీపీ నేతలే రూ.2.20 కోట్లు రుణాలు కాజేసిన వైనం గతంలోనే వెలుగులోకి రాగా, ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఆ వ్యవహారాన్ని నిగ్గు తేల్చే పనిలో అధికారులు ఉన్నారు. పర్చూరు, చీరాల పరిధిలోని 5 సొసైటీల్లో పెద్దఎత్తున అక్ర మాలు జరిగినట్లు గతంలోనే ఫిర్యాదులు వచ్చా యి. వీరందరి బాగోతం ప్రస్తుతం జరుగుతున్న కంప్యూటరీకరణ ద్వారా బహిర్గతం కానుంది

మొత్తం మూడు దశల్లో....పకడ్బందీగా....

సొసైటీల ఖాతాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ మూడు దశల్లో పకడ్బందీగా సాగుతోంది. మొదటి దశలో మొత్తం వివరాలను ఆన్‌లైన్ చేస్తారు. తర్వాత రెండో దశలో సైన్ ఆఫ్ ప్రక్రియ చేపడతారు. తర్వాత సొసైటీల మైగ్రేషన్ ఆన్‌లైన్ చేస్తారు. దీనిలో భాగంగా సొసైటీలో ఉన్న ఫర్నీచర్ వివరాలతో పాటు ఇతరత్రా ఆస్తుల వివరాలను డిజిటల్ చేయనున్నారు. సొసైటీ ఖాతాల డిజిటలైజేషన్‌లో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం కూడా ఉంది. ఒక్కో సొసైటీకీ రెండు లక్షల నిధుల మంజూరు. వీటిద్వారా ఈ ప్రక్రియకు కావాల్సిన 16 రకాల సాంకేతిక పరికరాలను సొసైటీలకు కేంద్రం అందించింది. ఈ ఆన్‌లైన్ ప్రక్రియ మొత్తం నాబార్డ్ పర్యవేక్షణలో జరుగుతుండడంతో కొన్ని సాంకేతిక పరమైన ఇబ్బందులు కూడా ఎదురవుతున్నట్లు యంత్రాంగం చెబుతోంది. ముఖ్యంగా నెట్ సమస్యతో పాటు సిస్టమ్ హ్యాంగ్ అవడం, ఆ సాఫ్ట్‌వేర్ విషయంలో ఉన్న సందేహాలను నివృత్తి చేసే వారు లేకపోవడం కూడా ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా సాగడానికి ప్రతికూలంగా ఉన్నాయని, అయినప్పటికీ బుధవారం కల్లా మొత్తం ఖాతాలను ఆన్‌లైన్ చేస్తామని అధికారులు చెబుతున్నారు.



ఇంకొల్లు పీఏసీఎస్ కార్యాలయ భవనం

ఐపీఎల్ జట్టులో.. గుంటూరు కుర్రోడు

- క్రికెటర్ రషీద్‌కు ఐపీఎల్ వేలంలో రూ. 30 లక్షలు
- చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో చోటు





రషీద్

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన యువ క్రికెటర్ షేక్ రషీద్ ఐపీఎల్ వేలంలో రూ. 30 లక్షలకు చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు దక్కించుకున్నది. సోమవారం జరిగిన వేలంలో రషీద్‌ని చెన్నై జట్టు కొనుగోలు చేసింది. అయితే ఆ జట్టులో దిగ్గజ ఆటగాళ్లు ఉన్న నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లలో ఆడే అవకాశం రషీద్‌కు ఇస్తారో, లేదోనన్న అనుమానాలు ఉన్నాయి. గత ఏడాది కూడా ఇలానే చెన్నై జట్టు రషీద్‌ని దక్కించుకోగా మ్యాచ్‌లలో ఆడే అవకాశం కల్పించలేదు. 20 సంవత్సరాల వయస్సు కలిగిన ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ స్వస్థలం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామం. రషీద్ బాల్యం ఇక్కడే గడిచింది. రషీద్ క్రికెట్ ప్రాక్టీసు కోసం ఆయన కుటుంబం గుంటూరు నగరానికి వలస వచ్చింది. ఇక్కడి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఒక చిన్న ఇంటిలో నివాసం ఉంటున్నది.

రషీద్ ఇప్పటివరకు 17 ఫస్టుక్లాస్ మ్యాచ్‌లు ఆడారు. 30 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసి ఒకసారి నాటౌట్‌గా నిలిచారు. 36.13 సగటుతో 1048 పరుగులు సాధించారు. ఇందులో ఇటీవలే హైదరాబాద్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో 203 పరుగుల డబుల్ సెంచరీతో మెరిశాడు. అలానే లిస్టు ఏ మ్యాచ్‌లు 8 ఆడి 62 పరుగులు మాత్రమే చేశాడు. టీ20లు 11 మ్యాచ్‌లు ఆడి 300 పరుగులు చేశాడు. 42.85 సగటుతో ఈ పరుగులు చేశాడు. టీ20లలో బెస్టు స్కోరు 100గా ఉన్నది. టీ20లలో స్ట్రైక్ రేట్ 139.54గా ఉన్నది. రషీద్ లెగ్‌స్పిన్ కూడా వేయగలిగిన ఆల్‌రౌండర్. అయితే ఆయనకు ఎక్కువగా బౌలింగ్ చేసే అవకాశాన్ని ఆయా జట్లు కల్పించలేదు. ఈ కారణంగా ఇప్పటివరకు రెండు వికెట్లు మాత్రమే తీశారు. రషీద్ అండర్-19 ప్లేయర్‌గా కూడా కొనసాగుతున్నాడు.

అవకాశాలు కల్పించాలి

ప్రతిభ ఉన్న క్రికెటర్లకు అవకాశాలు కల్పిస్తేనే వారు తమ సత్తాని నిరూపించుకోగలుగుతారు. ఈ సూత్రాని ఇండియన్ క్రికెట్‌లో మాజీ కెప్టెన్ సౌరబ్ గంగూలీ ఆచరణలో పెట్టడం వలనే ఎంఎస్ ధోని, యువరాజ్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్ వంటి ఆటగాళ్లు తయారయ్యారు. ఆ తర్వాత ఎంఎస్ ధోని తను కెప్టెన్సీగా ఉండగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, సురేష్ రైనా వంటి ఆటగాళ్లకు అవకాశం కల్పించారు. రషీద్ ముఖ్యంగా టెస్టు మ్యాచ్‌లలో సుదీర్ఘంగా ఆడగలిగిన సత్తా ఉన్నది. అలానే టీ20లలోనూ చురుకుగా బ్యాటింగ్ చేస్తాడు. ఈ నేపథ్యంలో చెన్నై సూపర్‌కింగ్స్ అతనికి అవకాశాలు కల్పించాలని క్రికెట్ అభిమానులుగా అందరం కోరుకుందాం.

భక్తజనంతో పులకించిన పుణ్యక్షేత్రాలు



8
- అమరావతి, కోటప్పకొండ, పెదకాకాని ఆలయాలను సందర్శించిన భక్తులు
- సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు

నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు
- సత్తెనపల్లిలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక, చిత్రకళా ప్రదర్శన

6
రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా... చేర్రెడ్డి మంజులారెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం నేడు

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి



ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుటూరు జిల్లాల పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తొలివిడత ఓటరు నమోదు ప్రక్రియ నవంబరు 6తో ముగియడంతో చాలా మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారని, దీంతో ఎన్నికల కమిషన్ మరోమారు అవకాశం కల్పించిందని తెలిపారు. డిసెంబరు 6లోపు మరోసారి ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పొప్పులను కూడా ఇప్పుడు సరిదిద్దుకోవచ్చని తెలిపారు. ఓటరుగా నమోదు కావాల్సిన వారు ఫారం- 18ని పూర్తి చేసి సమీపంలోని కూటమి కార్యాలయంలో ఇవ్వవచ్చని తెలిపారు. ఆన్‌లైన్లో కూడా నమోదు చేసుకోవచ్చని లేదా పూర్తి చేసిన పత్రాలు తహసీల్దారు కార్యాలయంలో ఇచ్చి రసీదు పొందవచ్చని తెలిపారు. గుంటూరు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని తన ప్రధాన కార్యాలయంలో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఓటు నమోదు ప్రక్రియ ఉంటుందని, అర్హులైనవారంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అద్దె బస్సులో రూ.లక్ష చీర మాయం

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ కోడలు చీర కావడంతో తలలు పట్టుకుంటున్న ఆర్టీసీ అధికారులు

వినుకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఆర్టీసీకి చెందిన అద్దె బస్సులో సుమారు రూ.లక్ష విలువచేసే ఖరీదైన చీర మాయమైన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలను పరిశీలిస్తే.. ఈ నెల 6వ తేదీన వినుకొండకు చెందిన అద్దె బస్సు వినుకొండ నుంచి తిరుపతి వెళ్తుంది. అద్దె బస్సుకు ఒంగోలు నుంచి నెల్లూరుకు ఆర్టీసీ కార్గో ద్వారా 16 పార్శిల్స్ ఇచ్చారు. అద్దె బస్సులో పనిచేస్తున్న డ్రైవర్ 15 పార్శిల్స్‌ను కార్గోకు అందించారు. విలువైన చీరను మాత్రం ఇవ్వకపోవడాన్ని ఆలస్యంగా గుర్తించారు. ఈ చీర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ కోడలకు చెందినది కావడంతో చీర విషయం తేల్చాలని ఆర్టీసీ అధికారులు ఆదేశించారు. బస్సుకు డ్రైవర్‌గా పని చేసిన వ్యక్తి ఫోన్ నంబరు నేటికీ పనిచేయకపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రబీ సాగుకు రైతులు సిద్ధం అవుతున్న తరుణంలో కాంప్లెక్స్ ఎరువులు కొండెక్కాయి. కాంప్లెక్స్ ఎరువుల ధర బస్తాకు రూ.100 పెరిగింది. 20:20:0:13 గతంలో రూ.1200 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1300కు చేరింది. 14:35:14 గతంలో రూ.1700 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1800కు చేరింది. 28:28:0 గతంలో రూ.1700 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1800 వరకు చేరింది. మిగిలిన ఎరువుల ధరలు యథాతథంగా ఉన్నట్లు తెలిసింది.

నడవకుండా 'మోటు'గా చంకనెక్కి..



ఈ రోజుల్లో మనుషులకంటే 'కుక్కలే' రాజభోగాలు అనుభవిస్తున్నట్లుంది. ఈ చిత్రమే అందుకు తార్కాణం. పిల్లలను చంకనేసుకున్నట్లు కుక్కని మోస్తూ కనిపిస్తున్న వ్యక్తి పేరు కోటేశ్వరరావు. ఊరు ప్రత్తిపాడు మండలంలోని కొండెపాడు. అతను ఎత్తుకున్న కుక్క పేరు మోటు. మూడు రోజులుగా జ్వరం వస్తుంటే ప్రత్తిపాడులో ఉన్న పశువుల డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్తున్నాడు. అది నడవకపోతుండటంతో ఇలా ఎత్తుకొని ఆటో కోసం ఎదురు చూస్తూ కనిపించాడు.

\- గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి

పొలం రాసివ్వాలంటూ బెదిరిస్తున్నారు

- 46వ రోజు ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ



దివ్యాంగుని నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న లోకేశ్

తాడేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ 46వ రోజుకు చేరుకుంది. సోమవారం ఉండవల్లి కరకట్ట వద్ద లోకేశ్ నివాసంలో నెల రోజుల విరామం అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అర్జీదారులు భారీగా విచ్చేసి నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి సమస్యలు విన్నవించారు. అందరి విజ్ఞప్తిని పరిశీలించిన లోకేశ్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మంగళగిరి నియోజకవర్గం నుంచి..

కుటుంబ అవసరాల కోసం తనఖా పెట్టిన తమ 3.10 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని అన్యాయం చేశారని తాడేపల్లికి చెందిన జి.కృష్ణకుమారి మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. స్త్రీధనం కింద తల్లిదండ్రులు చిలువూరులోని 3.10 ఎకరాల భూమిని రాసివ్వగా ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువు నిమిత్తం ఇప్పటంకు చెందిన ఎం. మధుసూదన్‌రెడ్డి దగ్గర తాకట్టు పెట్టి కరోనా సమయంలో తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించలేక పోయామన్నారు. ఇప్పుడు వడ్డీతో సహా మొత్తం చెల్లిస్తామని, తమ భూమి పత్రాలు అప్పగించాలని కోరగా భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని మధుసూదనరెడ్డి బెదిరిస్తున్నారన్నారు. తీసుకున్న అప్పునకు పొలం రాసివ్వాలంటూ పెదవడ్లపూడికి చెందిన అన్నే కృష్ణహర్ష, కృష్ణవినోద్, వైసీపీ నేత దేవినేని అవినాష్ పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని చినవడ్లపూడికి చెందిన వెనిగళ్ల వెంకటశివరావు ఫిర్యాదు చేశారు. అక్రమ కేసులతో వేధిస్తుండడంతో మానసిక వేదన అనుభవిస్తున్నామని తగు న్యాయం చేయాలని లోకేశ్‌ను కోరారు. ఉన్నత చదవులు చదివిన తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని తాడేపల్లికి చెందిన వి.రామకృష్ణారావు విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుడినైన తాను కుటుంబ పోషణ కోసం ఏదైనా చిన్న వ్యాపారం చేసుకునేందుకు ఆర్థికసాయం చేయాలని యర్రబాలెంకు చెందిన ఎం.నాగేశ్వరరావు, కోరారు. పరిశీలించి తగు న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి విజ్ఞప్తులివే...

వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అయిన తన భర్త గత ప్రభుత్వ అండతో టీడీపీ కూటమి నేతలపై ఇష్టానుసారంగా పోస్టులు పెట్టారని, ఇదేమని ప్రశ్నించినందుకు తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏలూరు జిల్లా శ్రీరామవరానికి చెందిన కామిరెడ్డి జయశ్రీ ఫిర్యాదు చేశారు. తన భర్త వెంకట నరసింహారావుపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసనపల్లిలో తన 0.92 ఎకరాలకు పట్టాదార్ పాస్‌పుస్తకం మంజూరు చేయాలని, దివ్యాంగుడినైన తాను అధికారుల తప్పిందంతో పాస్‌బుక్ కోసం పదేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని చెప్పారు. మీ సేవా ఆపరేటర్లను తగిన విధంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ మీ సేవా ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురు దివ్యాంగుల నుంచి లోకేశ్ వినతిపత్రాలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: ఎమ్మెల్యే జేబీఆర్



ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుతో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

కారంపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు సోమవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు విజయం సాధించడం ఆనందంగా ఉందనీ, ఆ జట్టులో కారంపూడి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉండడం ఎంతో గర్వకారణమన్నారు. క్రీడల ద్వారా ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. బాలుర విభాగంలో గెలుపొందిన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టును అభినందించి బహుమతులు అందించారు.

5 పాయింట్ల తేడాతో విజయం..

కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అండర్ - 14 రాష్ట్రస్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో ఫైనల్స్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టుపై 5 పాయింట్ల తేడాతో గెలుపొందింది. బాలికల విభాగంలో ఫైనల్స్‌లో చిత్తూరు జిల్లా జట్టు శ్రీకాకుళం జట్టుపై గెలుపొందింది. విజేతలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తేమ సాకు.. రైతుకు షాకు

(5పేజీ తరువాయి)

గుబులుతో కోత కోయటం ఆలస్యం ధాన్యాన్ని చేను నుంచి దాటించేస్తున్నారు. అయితే ఇక్కడే తేమ శాతాలతో చిక్కు వచ్చిపడింది.

బస్తాకు రూ. 200పైన ఎదురు వసూళ్లు

రైతు పండించిన ధాన్యం అమ్మితే కొన్న వ్యాపారి కానీ, మిల్లర్లు కానీ రైతుకే డబ్బు చెల్లించటం సహజం. అయితే ఇప్పుడు పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. తాను పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్ముకోవాలంటే ఎదురు డబ్బు కట్టాల్సి వస్తోంది. వరి కోతలు మొదలయిన తరుణంలో ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం 75 కిలోల బస్తా ఎ గ్రేడ్ రకానికి రూ. 1740, సాధారణ రకం ధాన్యానికి రూ. 1725గా ధర నిర్ణయించింది. అదే బయట మార్కెట్‌లో అయితే యంత్రాలతో కోసిన ధాన్యానికి ఎంత తేమ ఉన్నా బస్తా రూ. 1300 నుంచి రూ. 1400 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర దీనికి మించి ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాలకే అమ్మేందుకు ఇష్టపడుతున్నారు. అనుకున్నట్టే మార్కెటింగ్ శాఖ చూపిన ప్రకారం ధాన్యం అమ్మేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన ప్రక్రియ అంతా బాగానే ఉన్నా, తీరా మిల్లర్ దగ్గరకు వెళ్లే సరికి రైతుకు సమస్య ఎదురవుతోంది. తేమ 17 శాతం లోపు ఉంటే మాత్రం ఏ ఇబ్బందీ పెట్టటంలేదు. సమస్యంతా తేమ ఎక్కువగా ఉండే ధాన్యానికే. 18 నుంచి 21 శాతం వరకు తేమ ఉంటుండటంతో మిల్లర్లు కొనుగోలు చేయమని చెప్పకుండా, రైతుల నుంచి ముందస్తుగానే వసూళ్లకు దిగుతున్నారు. తేమ శాతం 17 నుంచి 19 శాతం ఉంటే బస్తాకు రూ. 200 చొప్పున, 20 నుంచి 21 శాతం తేమ ఉంటే రూ. 300పైన ఎదరు కట్టాలని రైతుల నుంచి నిలబెట్టి వసూలు చేస్తున్నారని, చెబుతున్నారు.

బస్తాకు రూ. 200 నుంచి రూ. 300 ఎదురు కట్టాల్సి రావటం ఇబ్బదిగా ఉందని, అదే ప్రభుత్వమే రేటులో కోత విధిస్తే, మిల్లర్లకు ఎదురు కట్టే పరిస్థితి ఉండదని, పైగా వారు మద్దతు ధరలో కోత కోసి దోపిడీ చేయకుండా తెరపడుతుందని, రైతులకు మేలు జరుగుతుందనేది రైతుల మాట. 75 కిలోల బస్తాకు ఎంత తేమ ఉంటే ఎంత తరుగుదల ఉంటుందనే అంశాన్ని వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో నిర్ణయించి రేటు నిర్ణయిస్తే చాలావరకు మేలు జరుగుతుంది. రైతుల నిలువుదోపిడీ లేకుండా పోతుంది. త్వరలో రైతు సంఘాల నాయకులు కూడా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ దగ్గరకు తీసుకువెళ్లాలనే ఆలోచనకు వచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై మరోసారి పునరాలోచించాలనేది రైతుల విన్నపం.

నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు



ప్రదర్శనను తిలకిస్తున్న ప్రసన్న వెంకటేష్, అరుణ్ బాబు

సత్తెనపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ, అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ అన్నారు. పల్నాడు జిల్లా రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక, చిత్రకళ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు బాలుర పాఠశాల ప్రిన్సిపల్ జాన్సన్, బాలికల పాఠశాల ప్రిన్సిపల్ శైలజ అధ్యక్షత వహించారు. సభలో ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ మేధాశక్తికి, పేదరికానికి సంబంధం లేదన్నారు. చాలా మంది మేధావులు గురుకులాల్లో విద్యను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా కొనసాగుతున్నారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను గుర్తించి వారిని ప్రోత్సహించి భావి తరాలకు మంచి శాస్త్రవేత్తలను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యతను గుర్తించి వారికి ఆత్మస్థైర్యాన్ని కల్పించటానికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను గురుకుల పాఠశాలలో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. అనంతరం ప్రసన్న వెంకటేష్, అరుణ్ బాబు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు విద్యార్థులచే ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 190 గురుకుల పాఠశాలల విద్యార్థులు 160 మంది తమ ప్రదర్శనలను ప్రదర్శించారు. గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, జోనల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదేళ్లు విద్యా వ్యవస్థతో ఆడుకున్నారు

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ. నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు అధికారాన్ని అడ్డం పెట్టుకొని విద్యా వ్యవస్థతో చెడుగుడు ఆడుకుని, ఇప్పుడు మొసలి కన్నీరు కార్చుతున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 5 ఏళ్లలో రాష్ట్రాన్ని యాభై ఏళ్ల వెనక్కి తీసుకువెళ్లిన జగన్ అరాచకాలకు ముందుగా బలి అయింది విద్యావ్యవస్థేనని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పాఠశాల విద్యలో సమస్యలు అంటూ జగన్ రాద్ధాంతం చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. దిగిపోయే నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,480 కోట్లు పెట్టి, ఇప్పుడు వాటి పేరు చెప్పి కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడం ఏమిటని ప్రశ్నించారు. అమ్మఒడి ఆగిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇటీవల బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి రూ. 6487 కోట్లు కేటాయించిది కనిపించలేదా అని ప్రశ్నించారు. జగన్ రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్లకుపైగా అప్పుల్లో పెట్టిపోయారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అందరూ అభినందిస్తుంటే జగన్ ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు.

భర్త ఇంటి ముందు భార్య నిరసన

పొన్నూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగం సంపాదించి స్థిరపడాలని అనుకున్న భార్యభర్తల మధ్యన వీసా నిరాకరణతో కాపురంలో కలహాలు చెలరేగి భర్త ఇంటి ముందు భార్య నిరసన దీక్షకు దిగిన సంఘటన పొన్నూరు మండలం ఆరెమండ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కట్టెంపూడి గ్రామానికి చెందిన గోపిశెట్టి మౌలిక అనే యువతికి ఆరెమండ గ్రామానికి చెందిన గరిగంటి మొగలాయి బాబుకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఎంబీఏ చదువుకున్న మౌలిక ఆస్ట్రేలియాలో స్థిరపడాలని, ఆమె ద్వారా భర్త కూడా ఆస్ట్రేలియా వెళ్లాలని ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే మౌలికకు రెండు సార్లు వీసా నిరాకరణకు గురైంది. విదేశాల్లో ఉద్యోగాన్వేషణ విఫలం కావడంతో అత్తింటి వారి నుంచి వేధింపులు ప్రారంభమైనట్లు ఆరోపిస్తున్నారు. ఇటీవల మొగలాయి బాబు తన భార్య మౌలికకు సంబంధించిన దుస్తులు, సామగ్రి పుట్టింటికి పంపించివేయటంతో అనుమానం వచ్చిన మౌలిక కుటుంబ సభ్యులు మొగలాయి బాబును నిలదీశారు. ఈ వివాదం చెలరేగటంతో మౌలిక తన భర్తను నిలదీయటానికి ఆరెమండ వెళ్లగా మొగలాయి బాబు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయినట్లు మౌలిక ఆరోపించింది. భర్త ఇంటి ముందే టెంట్ వేసి కుటుంబ సభ్యుల సహకారంతో నిరసనకు దిగింది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని మౌలికకు చెప్పారు. అయితే ఫిర్యాదు చేయడానికి నిరాకరించినట్లు తెలిసింది.

రేపు యూపీఎస్సీ ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

గుంటూరు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని, ఇందుకు అర్హులైన అభ్యర్థుల్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మయూరి సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు గుంటూరు రాజాగారితోటలో బీసీ స్టడీ సర్కిల్ నిర్వహించే పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

నేడు మంజులారెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం



రెంటచింతల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన చేర్రెడ్డి మంజులారెడ్డిని కూటమి ప్రభుత్వం రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించిన విషయం విదితమే. ఆమె మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. పదవీ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేశారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్

పిట్టలవానిపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతెనవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని హరిజన వాడ కాలనీకి చెందిన కర్లపూడి రాజశేఖర్ ఈ నెల 22న హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తన అత్త వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఆయన ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని రూ.40 వేలు విలువ చేసే గృహోపకరణాలను చోరీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చందోలు పోలీసుస్టేషన్‌లో ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ముగ్గురు నిందితులైన తెనాలికి చెందిన గుంజి శ్రీను, కట్టా వెంకటేశ్వర్లు, పొన్నూరుకు చెందిన దేవరకొండ కృపరాజులను అరెస్టు చేశారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుమందు తాగి కౌలు రైతు ఆత్మహత్య



మేడా రామిరెడ్డి (ఫైల్)

దాచేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక కౌలురైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మేడా రామిరెడ్డి (45) గత నాలుగేళ్లుగా పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్నాడు. పండిన పంటలకు పెట్టుబడి కూడా రాకపోవడంతో సుమారు రూ. 15 లక్షలకు పైగా అప్పులు చేశాడు. ఈ ఏడాది కూడా పత్తిపంటను సాగు చేశాడు. పంట దిగుబడి సరిగా లేకపోవడం, తీసుకున్న అప్పులు పెరగడంతో మూడు రోజుల క్రితం నివాస గృహంలో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు గ్రామంలో ప్రాథమిక చికిత్స చేయించి, మెరుగైన చికిత్సకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య వెంకట నరసమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.95
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

28,265 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 32,556 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 28,265 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 33,392 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	8000	14000
నెంబరు. 5	8000	13500	నెంబరు. 5	--	--
273	8500	11500	273	--	--
341	8000	14500	341	9000	13000
4884	-	-	4884	9000	13500
సూపర్ 10	-	-	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16500	తేజ	9000	16000
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	9500	12500
దేవనూరు డీలక్స్	9000	15700	దేవనూరు డీలక్స్	11500	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4500	10000

అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం సూర్యలంక తీరాన అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్తీకమాస చివరి సోమవారం రోజున తీరానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎప్పటికప్పుడు సేవలను విస్తృతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సెటిలర్ కళ్ళం హరినాధరెడ్డి, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వంగపాటి శివ, ఉపాధ్యక్షుడు మామిడి రమేష్, ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యం, చేజర్ల సతీష్, పులిగడ్డ శ్యామ్ ప్రసాద్, వంగపాటి నాగరాజు, ఆరుమళ్ళ సుధాకర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు చద్ది ప్రారంభం

కర్లపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వాములు, శివస్వాములు, భవానీ స్వాములకు దాతల సహకారంతో ఏర్పాటు చేసే చద్ది కార్యక్రమాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. మొదటి రోజు చద్దిదాతలు మేరువ ఆంజనేయప్రసాద్, చాంధిని, బొడ్డు సాయిమహేంద్రబాబు, వెంకటజ్యోతి, రవిదేవ రాజు, ఉదయచంద్రరావు, సుజాత, శ్రీకాకొల్లు గోవిందరాజులు అరుణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమామహేశ్వర దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలను నిర్వహించారు. ఈ పూజ, చద్ది కార్యక్రమాలను అధ్యక్షుడు పెనుమెత్స శ్రీనివాసరాజు, మెడతాటి శేషగిరిరావు, గాజుల శ్రీనివాసరావు, ఆట్ల వేణుమోహనరెడ్డి, పరిమి దత్తాత్రేయశర్మ, రాపర్ల కృష్ణప్రసాద్, నాయుడు వెంకట నారాయణ, తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, కన్నా నాగరాజు తదితరులు పర్యవేక్షించారు.

నీటి తీరువా వసూళ్ళు వేగవంతం చేయాలి : తహసీల్దార్

పిట్టలవానిపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నీటి తీరువా వసూళ్ళు వీఆర్‌వోలు వేగవంతం చేయాలని పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని 14 గ్రామపంచాయతీలలో రైతులు 14.34 ఫసలీకి సంబంధించి 2024 జూలై, 2025 జూన్‌కు సంబంధించిన నీటి తీరువా వసూళ్ళు వ్యవసాయం ద్వారా తమ పంటలను సాగు చేసుకునే రైతాంగం త్వరితగతిన పాత, ప్రస్తుత బకాయిలను వీఆర్వోలకు చెల్లించి తగు రశీదులు పొందాలని తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ మెహర్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులకు, రెవెన్యూ శాఖకు తగు సమయంలో నీటి తీరువా బకాయిలు చెల్లించి సహకరించాలని మండల రైతులకు తెలియజేశారు.

గ్రామాలలో సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులు : ఎంపీడీవో

పిట్టలవానిపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పిట్టలవానిపాలెం మండలంలో 14 గ్రామపంచాయతీల పరిధిలో నూతనంగా సీసీరోడ్లు నిర్మాణం, తదితర పనులు చేపడుతున్నారని ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 14 గ్రామపంచాయతీలకు సంబంధించి రూ.2 కోట్ల 45 లక్షలతో మొత్తం 31 పనుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, పనులు జరుగుతున్నాయని చెప్పారు. గ్రామాలలో నిర్మించే సీసీ రోడ్లు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు.

ప్రభుత్వం హామీలు అమలు చేయాలి : సీఐటీయూ

బాపట్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్లను విధులలోకి తీసుకొని రూ.10 వేలు పెంచి ఇస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కె.శరత్, వార్డు వలంటీర్ల యూనియన్ బాపట్ల జిల్లా కన్వీనర్ కోటేశ్వరి, కోకన్వీనర్లు అనూష, నసీమా, కిరణ్, రాజేష్, శివ పాల్గొన్నారు.

వరికి గిట్టుబాటు ధర కల్పించాలి : సీపీఎం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. భట్టిప్రోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం పార్టీ మూడవ మహాసభను నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. భట్టిప్రోలులో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో స్కానింగ్, ఎక్స్‌రే ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై మహాసభలో తీర్మానం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జి.సుధాకర్, కమిటీ సభ్యులుగా పి.మనోజ్‌కుమార్, మురుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, కె.రామస్వామి, దీపాల సత్యనారాయణ ఎన్నికయ్యారు. సభలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి.కృష్ణమోహన్, పార్టీ నాయకులు బోరుగడ్డ సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

చుండూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు వివిధ ప్రోత్సాహకాలతో వెన్ను తట్టి ప్రోత్సహిస్తే విద్యలో వారు మరింతగా రాణిస్తారని దుండిపాలెం సర్పంచ్ భగవద్గీత అన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇలోహిం చర్చి మినిస్ట్రీస్ తరుపున నోట్‌బుక్స్, కథల పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరిపూర్ణప్రసాద్, లక్ష్మి, సరళకుమారి, భార్గవి, విజయ్‌కుమార్, బూసిరెడ్డి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, శివప్రసాద్ తదితరులు

● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని, రాష్ట్ర ప్రభుత్వం రైతుకు అండగా ఉంటూ భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండలంలోని జంపనిలో సోమవారం ఆనందబాబు చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. డిసిఎంఎస్ మార్కెటింగ్ మేనేజర్ హరిగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో సమస్యలను చర్చిస్తూ ధాన్యం కొనుగోలు విషయంపై మాట్లాడటం జరిగింది.

దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఆదేశించారని, సంబంధిత ఆదేశాల మేరకు జంపనిలో కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారంగా తేమ 17 శాతం మించి ఉండకుండా రైతులు ధాన్యాన్ని ఆరబోసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాల ద్వారా వైసీపీ నాయకులు రైతుల నుంచి అధిక మొత్తంలోడబ్బులు వసూలు చేసి అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ మాట్లాడుతూ రైతులు తమకున్న సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకుని గిట్టుబాటు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ, జిల్లాలోనే ప్రథమంగా జంపనిలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. డిసీఎంఎస్ మార్కెటింగ్ మేనేజర్ హరిగోపాల్ మాట్లాడుతూ, క్లస్టర్లుగా విభజించి వీపీఏల వద్ద రైతులు నమోదు చేయించుకోవాలని, మూడు నాలుగు రోజుల్లో కొనుగోలు శాంపిల్స్ తీసుకుని ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, మార్కెటింగ్ ఏడీ రమేష్‌బాబు, వ్యవసాయ శాఖ ఏడీ విజయబాబు, సర్పంచ్ చుండూరు పెదమరియమ్మ, డీఎస్‌వో విలియమ్స్, బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల అధ్యక్షుడు దండే సుబ్బారావు, రాష్ట్ర మైనార్టీ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ నాయకులు పల్లా వాసుదేవరాయుడు, యోబు, రవిబాబు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ఖరీఫ్ సీజన్ 2024-25కు నిర్వహించటం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ డీఏవో వై.రామకృష్ణ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్‌వో విలియమ్స్, డీసీఎం మార్కెటింగ్ మేనేజర్ హరిగోపాలకృష్ణ, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని నాణ్యతాప్రమాణాలకు లోబడే విధంగా మెరుగుపరిచే విధంగా సిద్ధం చేసుకోవాలన్నారు. అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించటంలో ప్రభుత్వం విఫలమైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంటకు న్యాయమైన గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, రైస్ మిల్లర్స్, రైతులు రైతుసేవాకేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా కలసికట్టుగా పోరాడుదాం

● ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి

రేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హింసకు వ్యతిరేకంగా కలిసికట్టుగాపోరాడాలని నిజాంపట్నం ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి అన్నారు. నిజాంపట్నంలోని స్త్రీ శక్తి భవనంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయప్రచారం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం ర్యాలీ నిర్వహించి మహిళలు మానవహారంగా ఏర్పడ్డారు. ఆమె మాట్లాడుతూ మహిళల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీ మస్తాన్,సీసీలు శేషగిరిరావు, గాంధీ, శేషావతారం, ఆనంద్, నాగలక్ష్మి, మండల వీవోఏలు, సమాఖ్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

● బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంలో భాగంగా సోమవారం వెలుగు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బాపట్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జెండర్ ప్రచారాన్ని బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు అధ్యక్షతన ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మహిళల పట్ల అక్కడక్కడ చిన్నచూపు చూడటం జరుగుతుందని ఇది ప్రస్తుత సమాజానికి మంచిదికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్.నిరంజన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, మండలపరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిజాంపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో నాగలక్ష్మి తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నాగజ్యోతి

● బాపట్లరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళల హింస నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని ఇంటర్నల్ కంప్లైంట్స్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈసెమినార్‌కు ముఖ్యఅతిథిగా ఎం.నాగజ్యోతి పాల్గొని మాట్లాడుతూ మహిళలపై హింస నిర్మూలనకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నజీర్ పాల్గొన్నారు.

● కర్లపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు కర్లపాలెం ఎంపీడీవో, తహసీల్దార్, ఏపీఎం కార్యాలయాల సిబ్బంది సోమవారం అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయం నుంచి కర్లపాలెం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అన్ని డిపార్ట్‌మెంట్‌ల సిబ్బందితో కర్లపాలెం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, సూపరింటెండెంట్ రజనీ, ఏపీఎం శ్రీనివాసులరెడ్డి, షాలిని పాల్గొన్నారు.

● చుండూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : లింగ వివక్షత వ్యతిరేకంగా చుండూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.కుమారస్వామి మాట్లాడుతూ చిన్నారులపై అఘాయిత్యాలు, గృహహింస, పని చేసే చోట లైంగిక వేధింపులు, మహిళలు, పిల్లల అక్రమ రవాణా వంటి సామాజిక సమస్యలు పెరిగాయన్నారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో మండల అధ్యక్షుడు జాలాది రూబెన్, ఏఈ మరియదాసు, ఏపీఎం చంద్రశేఖర్, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోటీ దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి కోటి దీపోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని దీపాలను వెలిగించారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో మహిళలు ఆలయం చుట్టూ శివలింగ ఆకృతిలో దీపాలను వెలిగించారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

● కొల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గంగాపార్వతి సమేత అనంత భోగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి స్థానిక శివాలయంలో నాగేంద్రస్వామితో కూడిన లింగాకృతిని రూపొందించి భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకులు కొమ్మూరి వెంకటశివప్రసాద్, అనంత్‌శర్మ, శివశర్మలు పూజాది కార్యక్రమాలు జరుపగా ఆలయ కార్య నిర్వహణాధికారి నాగిశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకదీపాలను వెలిగిస్తున్న భక్తులు

● బాపట్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం ఆఖరి సోమవారం కావటంతో బాపట్ల మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. బాపట్లలోని శ్రీ గంగాపార్వతి వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని శివలింగాలకు పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. దేవాలయాలు మొత్తం శివనామస్మరణతో మారుమ్రోగగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 1569 మందికి ఓటు హక్కు : తహసీల్దార్

వేమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల మీద ప్రారంభించిన ప్రక్రియలో మండల పరిధిలో 1569 మంది ఓటు హక్కుకు అర్హులైనట్లు తహసీల్దార్ సుశీల తెలిపారు. 250 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా అర్హత కలిగి ఉండి ఓటు హక్కు పొందకపోతే డిసెంబరు 9లోగా ఆన్‌లైన్ ద్వారా గాని స్వయంగా దరఖాస్తులు అందిస్తే వాటిని పరిశీలించి వారిలో అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు.

నిర్మాణం జరుగుతున్న పెట్రోల్ బంకును పరిశీలించిన ఆర్డీవో

కర్లపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తనందాయపాలెం పరిధిలో ఉన్న హెచ్‌జేబీ కళాశాల సమీపంలో జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మాణం జరుగుతున్న పెట్రోల్ బంకు స్థలాన్ని బాపట్ల ఆర్డీవో గ్లోరియా సోమవారం రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించారు. బాపట్ల న్యాయవాది డికె బెంజ్ డ్రైనేజిని పూడ్చి వేసి పెట్రోలు బంకు నిర్మాణం చేస్తున్నారని దానిని తొలిగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని ఆయన ఆదేశాల మేరకు ఆర్డీవో బంకు స్థలాన్ని పరిశీలించారు. పెట్రోల్ బంకు మ్యాప్‌ను పరిశీలించి నిర్వాహకుడు పేరాల వెంకట సురేష్‌ను పిలిచి మాట్లాడారు. ఉన్నతాధికారులకు విషయం తెలిపి అవసరమైన చర్యలు చేపడుతామని తహసీల్దార్ సుందరమ్మ వివరించారు. వీరి వెంట వీఆర్వో అమానుల్లాఖాన్, శివనాగరాజు ఉన్నారు.



పెట్రోల్ బంకు మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా

కురుప్పాలెంలో చోరీ

రేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గృహంలో యజమానులు లేని సమయంలో ఇంటితాళాలను పగులకొట్టి దొంగతనం చేసిన సంఘటన గుళ్ళపల్లి పంచాయతీ కురుప్పాలెంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. చెరుకుపల్లి ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కురుప్పాలెం గ్రామానికి చెందిన బి.లక్ష్మి తన భర్త బసవయ్యతో కలిసి గుంటూరులో కుమారుడి ఇంటికి వారం రోజుల క్రితం వెళ్ళారు. దొంగలు ఆదివారం అర్ధరాత్రి ఇంటి తాళాలను పగులకొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని బంగారు చైన్, చిన్నఉంగరం, రూ.7వేలు నగదు, నాలుగు చీరలు దొంగిలించినట్టు తెలిపారు. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. బాపట్ల నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించామని తెలిపారు.

కూలిపోయిన వెల్లటూరు ఛానల్ చప్టా పరిశీలన

● తాత్కాలిక పనులు చేపట్టి సాగునీరు అందిస్తామన్న అధికారులు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కూలిపోయిన వెల్లటూరు ఛానల్ చప్టాను ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, డ్రైనేజీ డీఈ మురళీకృష్ణ సోమవారం పరిశీలించారు. భట్టిప్రోలు సమీపంలో ఉన్న చప్టాను పరిశీలించిన అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ కాలం చెల్లడంతో చప్టా కూలిపోయిందని, దిగువ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత సీజన్‌లో దిగువ ఆయకట్టు రైతులకు నీరు అందించే విధంగా చప్టా వద్ద తాత్కాలిక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ దీన దయాళ్, ఏఈలు సువర్చలా, అబ్దుల్ సలాం పాల్గొన్నారు.



కూలిపోయిన చప్టాను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరత్నం, డ్రైనేజీ డీఈ మురళీకృష్ణ

రైతు సమస్యలపై చర్చించిన జేసీ

వేమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామానికి సోమవారం విచ్చేసిన జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ రైతులతో మమేకయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ, ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేదని, తుఫాన్ వచ్చినట్లయితే చేతికందిన వరి పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం ముందస్తుగా ఒక ప్రకటన చేయాలని కోరారు. స్పందించిన ఆయన ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రకృతి వైపరీత్యం వల్ల ఏమాత్రం పంట దెబ్బతిన్నా రైతుకు సహకరించే విధంగా తనవంతు సిఫార్సు చేస్తానని అన్నారు.

రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం

రేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలోని నిజాంపట్నం మండలం మంత్రిపాలెం నుంచి అడవులదీవి ఆర్ అండ్ బీ రహదారి అభివృద్ధి పనులకు సోమవారం మంత్రి సోదరుడు అనగానిశివప్రసాద్ ప్రారంభించారు. గత జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఎన్నో సార్లు ఈ గ్రామాల ప్రజలు గుంతలు పూడ్చాలని విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సమస్యను రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్ళటంతో ఆయన రూ.80 లక్షల నిధులను మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు,మాజీ జడ్పీటీసీ మేకా వెంకటశివరామకృష్ణ, కూచిపూడి మోహన్‌రావు, శొంఠి శ్రీనివాసరావు, ఓగిబోయిన వెంకట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : మైనేని

కొల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ అన్నారు. కొల్లూరులో మైనేని శివయ్య అనే లబ్ధిదారు నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఆయన సోమవారం ఎంపీడీవో నరసింహారావుతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పశుపోషకుల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టనున్నారు. కొద్దిపాటి స్థలం ఉంటే మినీ గోకులం షెడ్డు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లికార్జున, ఏపీవో లక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య, ఉపసర్పంచ్ ధూళిపూడి కృష్ణ పాల్గొన్నారు.

గృహంలోకి దూసుకువెళ్ళిన కారు

రేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండలం కనగాల గ్రామంలో పెడన నుంచి బెంగుళూరు వెళుతున్న కారు అదుపు తప్పి ఆదివారం తెల్లవారుజామున గృహంలోకి దూసుకు వెళ్ళింది. కారులో డ్రైవర్ నిరంజన్, కారు యజమాని అవినాష్‌లు బెంగుళూరు వెళ్ళుతున్నారు. కనగాల మూలమలుపు తిరిగే సమయంలో అదుపుతప్పి కారు ఒక గృహంలోకి అరటి చెట్లను ఢీకొంటూ వెళ్ళింది. కారునుజ్జునుజ్జు అవ్వగా నిరంజన్, అవినాష్‌లకు స్వల్పగాయాలయ్యాయి.

మద్యం విక్రేత అరెస్టు

భట్టిప్రోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. మండలంలోని రాచూరులో బెల్టుషాపు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేస్తున్నారని సమాచారం అందడంతో సోమవారం ఎక్సైజ్ సీఐ దివాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడిలో చిలకా అర్జునరావు నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు తెలిపారు.



అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు పరిష్కరించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా తమ సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ పురోగతిలో జిల్లా వెనుకకు వెళితే సహించేదిలేదని స్పష్టం చేశారు. రెవెన్యూఅధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. జీయో ట్యాగింగ్ ప్రక్రియలో అత్యంత వెనుకబాటులో ఉన్న ఆరుగురు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. రీసర్వే ఆయా గ్రామాలలో లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆన్‌లైన్ ద్వారా జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. రీసర్వే పై పలు ఫిర్యాదులు వస్తున్నాయని తక్షణమే పరిష్కరించాలన్నారు. ఆర్డీవోల పర్యవేక్షణ కొరవడిందన్నారు. రెవెన్యూశాఖా మంత్రి ఉన్న బాపట్ల జిల్లాలోనే నిర్లిప్తంగా ఉంటే సహించేదిలేదన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో భారతరాజ్యాంగం పీఠికను ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈనెల 26వ తేదిన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బాపట్ల పట్టణంలో ప్రదర్శన ఉంటుందన్నారు. తదుపరి వేడుకలు జరుగుతాయని జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూఅధికారి జి.గంగాధర్‌గౌడ్, అన్నిశాఖల జిల్లా అధికారులు, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం రోడ్డులోని ఏజి ఇంజనీరింగ్ కాలేజి ఎదురు గల మాదాల నారాయణస్వామి కాలనీలో నివాసం ఉంటున్న ఎస్టీ, ఎస్సీ, బీసీ, ముస్లిం మైనార్టీ ప్రజలు తమ కాలనీలో మౌలిక వసతులు లేవంటూ సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రాన్ని కలెక్టర్ జె.వెంకటమురళికి అందజేశారు.

● జనగణనతోపాటు కులగణన జరపాలని కోరుతూ సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు నేతలు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకర్లతో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిబోయన తాతయ్య మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి సాధ్యమౌతుందనే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ఎస్‌పి రాజు, మారం రవికుమార్, పేరాల సురేష్‌కుమార్, ఉప్పలదిన్నె గోపినాధ్ తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారని తహసీల్దార్ తెలిపారు. మండలంలోని పోతన కట్టవారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి భూ సమస్యలు పరిష్కరించాలని అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైనికులకు అన్నివిధాలుగా సహకరించాలి : కలెక్టర్

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశసరిహద్దులలో ప్రాణాలనె తెగించి దేశానికి, ప్రజలకు అండగా నిలుస్తున్న సైనికులకు అన్నివిధాలుగా సహకరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణాలు విడిచిన సైనికులకు డిసెంబరు 7న ఆర్మీ ఫ్లాగ్ డేలో నివాళులర్పిస్తూ వారి కుటుంబాల సహాయార్థం విరాళసేకరణ జరుగుతుందన్నారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ వారు రూపొందించిన రూ.2, రూ.5 విలువగల ఆర్మడ్ ఫోర్స్ యంత్రాలు, చిహ్నాల స్టిక్కర్లను ఆయన విడుదల చేశారు. ప్రతి ఒక్కరు ఆస్టిక్కర్లను కొనుగోలు చేసి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసరావు, జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి గుణశీల పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు ఉపేక్షించేది లేదు

మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు జరిగితే ఉపేక్షించేది లేదని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. బాపట్ల మున్సిపాలిటీ అభివృద్ధిపై మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు జవాబుదారీతనం, బాధ్యతతో పారదర్శకంగా పని చేయాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రెండో చెరువును ఏర్పాటుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రఘునాధరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలి

● అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమ్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను వెంటనే చట్టపరిధిలో విచారణ జరిపి నిర్దిష్ట గడువులోపు వాటిని పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీసు అధికారులను అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలను అడిషనల్ ఎస్పీ నేరుగా అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కార మార్గం చూపారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై మొత్తం 33మంది అర్జీదారులు వారి సమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్

బాపట్ల,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డిసెంబరు 7వ తేదీన బాపట్ల పర్యటన సందర్భంగా పురపాలక సంఘ పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాంగణ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సంజయ్‌గాంధీకాలనీలో ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. వంటశాల, విద్యార్థుల రూమ్‌లను పరిశీలించారు. ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు ఉన్నారు. అదేవిధంగా రైతుబజారు వద్ద ఉన్న జమ్ములపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి కింద గల ప్రాంతాన్ని బాపట్ల పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్‌జానీతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేపట్టి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

రేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైతేపల్లి గ్రామానికి చెందిన మేరుగ రవిబాబు(24)అప్పులు తీర్చలేక మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రవిబాబుకు నాలుగు సంవత్సరాల క్రితం పేటేరు గ్రామానికి చెందిన షారూన్‌తో వివాహం అయ్యింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇల్లు కట్టడం కోసం అప్పులు చేశాడని, అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక మనస్థాపానికి గురై ఈనెల 23వ తేదీ గడ్డిమందు తాగాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



రవిబాబు మృతదేహం

ప్రకృతి వరి.. నో వర్రీ

- గింజ పాలు దశలో పడిపోకుండా ఉన్న పైరు
- గుంటూరు జిల్లాలో 12 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ వరి సాగు
- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ
- పరిశీలన కోసం తెలంగాణ నుంచి వచ్చిన రైతులు


పడిపోకుండా ఉన్న ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంట


పూర్తిగా పడిపోయిన రసాయన ఎరువులు వాడిన వరి పంట

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతికి పుడమి కూడా పులకరిస్తుంది. ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడకపోవటం వల్ల భూమి కూడా కర్షకులకు సహకరిస్తుంది. గుంటూరు జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట నూతన అధ్యాయానికి నాంది పలికింది. తుపానును సైతం తట్టుకొని నిలబడిన ప్రకృతి వ్యవసాయ వరి పంట ఇప్పుడు మరో రికార్డు సృష్టించింది. గింజ పాలు పోసుకునే దశలో రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడిన వరి పంట పూర్తిగా పడిపోగా, ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన పొలాల్లో పంట ఏపుగా నిలబడి ఉండటం చూసి రైతులు, వ్యవసాయ అధికారులు ఆశ్చర్య పోతున్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 12 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పైరు కీలకమైన దశలో నిలబడి ఉన్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ పంటను చూసేందుకు పక్క రాష్ట్రాల నుంచి రైతులు వందల సంఖ్యలో వచ్చిపోతున్నారు.

పెట్టుబడి తక్కువే...

ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 56 వేల హెక్టార్లలో వరి సాగుచేశారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడిన పంటలకు ఎకరాకు సుమారు రూ. 26 వేల నుంచి రూ.30 వేల వరకు (కోత కూలీ కలుపుకుని) పెట్టుబడి గా పెట్టారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతి లో సాగు చేసిన పొలాల్లో పెట్టుబడి సాధారణ పొలాల తో పోల్స్తే ఎకరాకు రూ.10 వేల వరకు తగింది. విత్తనాలు కూడా తక్కువగా నే వాడినట్లు రైతులు చెబుతున్నారు.

కీలక దశలో పడిపోయిన పైరు

ప్రస్తుతం చాలా చోట్ల వరి కోత దశకు చేరింది. రసాయన ఎరువులు వాడిన పొలాల్లో భూమిలో పటుత్వం తగ్గి గింజ పాలు పోసుకొని ముగ్గే దశలో వరి పైరు పడిపోయింది. ఈ పొలాల్లో ఖరీఫ్ లో ఎకరాకు రెండు బస్తాల డీఏపీ, ఒక బస్తా కాంప్లెక్స్ ఎరువులు, మూడు బస్తాలు యూరియా వాడినట్లు రైతులు చెబుతున్నారు. అదీకాక రబీలో మొక్క జొన్న, జొన్న సాగు సందర్భంగా ఇబ్బడిముబ్బడిగా ఎకరాకు 10 బస్తాలకు తగ్గకుండా యూరియా వాడినట్లు గుర్తించారు. దాని ప్రభావం వల్ల వరి కీలకమైన దశలో పంట పూర్తిగా నేల మీద పడిపోయింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న పొలాల్లో ఎరువుల వాడకం పూర్తిగా ఆపివేయడంతో నేల పటుత్వంతో ఉండి గింజ పాలు పోసుకునే దశలో కంకులు నిలబడి ఉన్నాయి.

పైరు పడిపోతే చాలా నష్టం...

వరి పంట పడిపోవడం వల్ల రైతులకు అపార నష్టం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పడిపోవడం వల్ల విత్తనాలు పాలుపోసుకోక తాలు గింజలు తయారు కావటం, పూర్తిగా మగ్గక పోవటం, అరగింజలు, విరిగిన గింజలు తయారు కావటం జరుగుతుందని చెబుతున్నారు. వీటి ప్రభావం వల్ల పంట దిగుబడి కూడా పూర్తిగా తగ్గిపోతుంది. ఇంత నష్టం వరి సాగు చేసిన చివరి 20 నుంచి 25 రోజుల్లో జరుగుతుంది. ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన వరికి ఈ ప్రమాదం లేదు. కంకులు ఏపుగా నిలబడి ఉండటం వల్ల గింజ పాలు పోసుకుని, ముగ్గే దశలో మేలు జరుగుతుంది. తద్వారా దిగుబడి కూడా పెరుగుతుంది.

తరలి వచ్చిన తెలంగాణ రైతులు..

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వరి చివరి దశను పరిశీలించేందుకు సోమవారం తెలంగాణ రైతులు జిల్లాకు వచ్చారు. వేజెండ్ల, అత్తోట, కొల్లిపొర మండలంలోని పలు గ్రామాల్లో వరి పైరును సాగు చేశారు. ఒకే చోట రసాయనిక ఎరువులు వాడిన పంటకు,ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటకు మధ్య ఉన్న తేడాను అధికారులు తెలంగాణ రైతులకు చూపించారు.



మాకే ఆశ్చర్యం వేసింది

రాజకుమారి, జిల్లా మేనేజర్, ప్రకృతి వ్యవసాయం



జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంట పడిపోకుండా నిలబడి ఉంది. తుఫాను సమయంలో కూడా అంత వరదలోనూ తట్టుకొని వెంటనే తిప్పుకుంది. పంట సంరక్షణ కోసం రైతులు మేము సూచించిన కషాయాలు మాత్రమే వాడారు. ఇప్పుడు వాళ్ళ కళ్ళలో ఆనందం కనిపిసున్నది. రెండు పొలాల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తుంటే మాకే ఆశ్చర్యం వేస్తుంది.

ప్రకృతి పద్ధతే మంచిది

నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడం రైతులకు అన్ని రకాలుగా మంచిది. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల భూమి తో పాటు,పర్యావరణం పాడవుతుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి చక్కగా నిలబడి ఉంది. ఈ సంవత్సరం ఆ రైతులకు మంచి దిగుబడి కూడా వచ్చే అవకాశం ఉంది.

ఏఎన్‌యూలో నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

పెదకాకాని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు దక్షిణ, పశ్చిమ మండల అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పాల్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాల్ కుమార్ మాట్లాడుతూ ఈ పోటీలు మహిళలకు ఈ నెల 26వ తేదీ నుంచి 28 వరకు, పురుషులకు ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 125 విశ్వవిద్యాలయాల నుంచి వెయిట్ లిఫర్టులు ఈ పోటీలలో పాల్గొంటారని వివరించారు. పోటీలను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మీ, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య హాజరుకానున్నారు.

సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ జె.వెంకట మురళి


అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ జె. వెంకటమురళి సూచించారు. జిల్లా అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి డిసెంబరు 7న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారని తెలిపారు. అధికారిక సమాచారం వచ్చినందున అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులు, మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా సమగ్రప్రణాళికతో అధికారులు పనిచేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు అందుతాయన్నారు. ఆయాశాఖల అధికారులు చేపట్టాల్సిన పనులను వివరించారు. సీఎం పర్యటనకు 10 రోజులు గడువు ఉన్నందున మంచి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

రహదారులకు మహర్దశ!

(5వ పేజీ తరువాయి)

తెనాలి రోడ్డు దుగ్గిరాల వద్ద, చిలకలూరిపేట- పెదనందిపాడు రోడ్డు, వట్టిచెరుకూరు- పొంద్రపాడు, యర్రగుంట్లపాలెం- తుళ్లూరు, కాజ- ఉప్పలపాడు, గుంటూరు- హనుమాన్‌పాలెం, తెనాలి నారా కోడూరు రోడ్లను నిర్మించనున్నారు.

పల్నాడు జిల్లాకు..

పల్నాడు జిల్లాలో తక్షణ మరమ్మతుల కోసం భారీగా నిధులు కేటాయించారు. ఏడు నియోజకవర్గాల్లో జిల్లా ప్రధాన రహదారుల మరమ్మతుల నిమిత్తం 4.86 కోట్లు కేటాయించారు. అత్యధికంగా గురజాల నియోజకవర్గానికి 1.12 కోట్లు కేటాయించగా, చిలకలూరిపేటకు 93.7 లక్షలు, నరసరావుపేటకు 89.6 లక్షలు, మాచర్లకు 85 కోట్లు చొప్పున కేటాయించారు. వీటితోపాటు అత్యవసర మరమ్మతుల కింద 567.8 కిలో మీటర్ల రహదారుల్లో 82 పనులకు మొత్తం 22.44 కోట్లు కేటాయించారు. వీటిలో 72 మరమ్మతులకుగానూ 3.44 కోట్లు, 371 కి.మీ మేర ప్యాచ్ వర్కుల నిమిత్తం 11.57 కోట్లు, రోడ్డు అంచుల ప్యాచ్ వర్కుల కోసం 94.5 లక్షలు, కంపచెట్ల తొలగింపు కోసం 91.7 లక్షలు, వర్షపు నీటికి దెబ్బతిన్న రోడ్లకు 4.15 కోట్లు కేటాయించారు. ప్రధానంగా రొంపిచర్ల, చిలకలూరిపేట, మాచర్ల, దాచేపల్లి, పెదకూరపాడు, సత్తెన పల్లి, నరసరావుపేట, వినుకొండ, శావల్యాపురం, కారంపూడి, గురజాల, పిడుగురాళ్ల, క్రోసూరులలో ఈ రోడ్లకు మరమ్మతులు చేయించనున్నారు.

బాపట్ల జిల్లాకు రూ. 72.5 కోట్లు

బాపట్ల జిల్లాలో బాపట్ల- రేపల్లె సబ్ డివిజన్లో 217 కి.మీ మేర రాష్ట్ర రహదారులు, 599.6 కి.మీ మేర జిల్లా ప్రధాన రహదారులకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. జిల్లా రహదారుల మరమ్మతులకు సంబంధించి కోటిన్నర రూపాయలతో ఇప్పటికే పనులు పూర్తి చేశారు. కేంద్ర రహదారుల నిధుల కింద రూ. 36.31 కోట్లతో 60.35 కి.మీ మేర రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ. 8.91 కోట్లతో 5.97 కి.మీ మేర రోడ్లు నిర్మిస్తున్నారు. వాటితోపాటు రేపల్లె- నిజాంపట్నం మధ్య రెండు చోట్ల పైప్ కల్వర్టులు, గుంటూరు చీరాల మధ్య మరో కల్వర్టు నిర్మిస్తున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో కత్రపాడు- శంకరపురం రోడ్డు, రావినూతల రోడ్డు, రేపల్లె- నిజాంపట్నం రోడ్డు, పర్చూరు వంకాయలపాడు- కొడవలివారిపాలెం రోడ్డు, చీరాల- దగ్గుబాడు రోడ్డు, గర్నెపూడి- తిక్కరాజు పాలెం, నూతలపాడు- కారంచేడు, కారంచేడు- ఇంకొల్లు, పందిళ్లపల్లి- కడవకుదురు, వేటపాలెం, సంతరావూరు, జాండ్రపేట- వేటపాలెం, పర్చూరు- ఇంకొల్లు, వేమూరులో వెల్లటూరు- జువ్వలపాలెం, గాజుల్లంక- చింతమోటు, చినపులివర్రు- రావికంపాడు, తెనాలి- వెల్లటూరు, బాపట్లలో ఖాజీపాలెం- బుద్దం మొత్తం 22 పనులకు రూ. 1.15కోట్లు కేటాయించారు. వీటితోపాటు 14 చోట్ల జంగిల్ క్లియరెన్సు పనుల నిమిత్తం 71.28 లక్షలు కేటాయించారు.

భక్తజనంతో పులకించిన పుణ్యక్షేత్రాలు

- అమరావతికి పంచారామాల భక్తులు
- కోటప్పకొండకు వేలాదిగా భక్తులు
- పెదకాకాని శివయ్య సన్నిధిలో శివనామస్మరణ
- సూర్యలంక సముద్ర తీరంలో పుణ్యస్నానాలు


అమరావతి : కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని భక్తజనంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు పులకించాయి. ప్రముఖంగా గుంటూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని అమరావతి అమరేశ్వరాలయం, కోటప్పకొండపైనున్న త్రికోటేశ్వర స్వామి సన్నిధి, పెదకాకాని మల్లేశ్వర స్వామి ఆలయం, బాపట్ల జిల్లాలోని సూర్యలంక సాగర తీరంలో భక్తులు కార్తీక మాస పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మికశోభను సంతరించుకున్నాయి.

అమరావతి, నరసరావుపేట, పెదకాకాని, బాపట్ల రూరల్, నవంబరు 25: (ఆంధ్రజ్యోతి) అమరావతిలోని అమరేశ్వర ఆలయానికి ఆదివారం అర్ధరాత్రి నుంచే వివిధ ప్రాంతాల నుంచి పంచారామ పుణ్యక్షేత్రాలు దర్శించే భక్తులు చేరుకున్నారు. సోమవారం తెల్లవారు జామున 3గంటల నుంచి పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించారు. అనంతరం కృష్ణాతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలిగించి పూజలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం వరకు భక్తులు ఆలయాన్ని సందర్శిస్తూనే ఉన్నారు. సాయంత్రం స్వర్ణయుగ సేవాట్రస్టు చైర్మన్ దర్శనపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్షదీపోత్సవం జరిగింది. భక్తులకు ఏర్పాట్లను ఈవో పీ. సునీల్‌కుమార్ పర్యవేక్షించారు. డీఎస్పీ ఎం. హనుమంతరావు పలువురు పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

త్రికోటేశ్వర స్వామికి వైభవంగా రుద్రాభిషేకం

ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో కార్తీక సోమవారం పురష్కరించుకోని త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీమేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వరస్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. విశేష పుష్పాలకంరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి స్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో.. నందీశ్వరుని విగ్రహం వద్ద పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. అలయ ఈవో డీ.చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.

మల్లేశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు

పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానములో వేకువజామునుంచే భక్తులు బారుతు తీరారు. యజ్ఞాల బావి వద్ద కార్తీకమాస స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణములో కార్తీక దీపారాధన పూజలు చేశారు. పలువురు భక్తులు కళ్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవా రుసుములు, ప్రసాదం విక్రయం, అన్నప్రసాద విరాళం, వస్త్రాల బహిరంగ వేలం ద్వారా రూ. 10.10 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఉపకమిషనరు కేబీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయంలో మల్లేశ్వరస్వామి వారికి లక్షబిల్వార్చన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ ఉప కమిషనరు కోరారు.


పెదకాకాని శివాలయంలో క్యూలో బారులు తీరిన భక్తులు


సూర్యలంక తీరంలో పుణ్యస్నానాలను ఆచరిస్తున్న భక్తులు

సూర్యలంక తీరానికి పోటెత్తిన భక్తులు

బాపట్ల మండలం సూర్యలంక తీరం భక్తులతో పోటెత్తింది. అధిక సంఖ్యలో సందర్శకులు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తీరం ఒడ్డున మహిళలు కార్తీకదీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం సముద్రదేవునికి తాంబూలం సమర్పించి కార్తీకదీపాలను సముద్రనీటిలో వదిలారు. సమీపంలోని శ్రీతారకేశ్వరస్వామి దేవాలయం, బాపట్లలోని శివాలయాలకు భక్తులు తరలి వెళ్ళి ప్రత్యేక పూజలను నిర్వహించుకున్నారు. తీరంలో పర్యాటకులు అధిక సంఖ్యలో రావటంతో బాపట్లరూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సాహస జీవితం.. నదిపైనే జీవనం!

- కృష్ణమ్మను నమ్ముకున్న మత్స్యకారులు
- గాజుల్లంక రేవు నుంచి శ్రీకాకుళానికి నిత్యం పడవ ప్రయాణం
- సురక్షితంగా ఇవతల ఒడ్డు నుంచి అవతలకు ప్రయాణికులు
- వచ్చిన ఆదాయాన్ని సమానంగా పంచుకుంటున్న మత్స్యకార కుటుంబాలు


గాజుల్లంక నుంచి శ్రీకాకుళానికి ప్రయాణికులను తరలిస్తున్న పడవ


ద్విచక్ర వాహనాలను కూడా పడవలోకి ఎక్కిస్తున్న మత్స్యకారులు

కొల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వారికి కృష్ణమ్మే ఆధారం... నిత్యం కృష్ణానదిపైనే జీవనం చేస్తూ వచ్చిన చాలీచాలని ఆదాయాన్ని సమానంగా పంచుకుని మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. భారీ వరదల్లో సైతం తమ ప్రాణాలు పణంగా పెట్టి లంక గ్రామాల్లో ప్రజలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చుతారు. వారి జీవనం రోజూ సాహసమే. కొల్లూరు మండలంలోని గాజుల్లంక గ్రామంలో సుమారు 400 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వారిలో కొంతమంది కృష్ణానదిలో చేపల వేట సాగిస్తారు. మరికొన్ని కుటుంబాలు నదిలో నీరు ఉన్నప్పుడు తమ పడవల ద్వారా ప్రయాణికులను నదిలో ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు దాటిస్తూ వారు ఇచ్చింది తీసుకుని అందరూ సమానంగా పంచుకుంటారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం ఉన్నప్పుడు గాజుల్లంక నుంచి శ్రీకాకుళం వెళ్లాలంటే పడవలే శరణ్యం. గాజుల్లంక రేవు నుంచి నిత్యం వందలాది మంది తెనాలి, వేమూరు, అమృతలూరు, కొల్లూరు తదితర ప్రాంతాల నుంచి కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళంకు పడవల ద్వారా ప్రయాణం చేస్తుంటారు. వారితోపాటు ద్విచక్ర వాహనాలను సైతం పడవల ద్వారా తరలించుకుంటారు. రోడ్డు మార్గాన కొల్లూరు నుంచి శ్రీకాకుళం వెళ్లాలంటే సుమారు 40-45 కి.మీ దూరం ఉంటుంది. అదే గాజుల్లంక నుంచి కృష్ణానదిలో పడవల ద్వారా కేవలం ఏడు, ఎనిమిది కి.మీ మాత్రమే. దీంతో ప్రయాణ సమయం కలిసి వస్తుంది. పైగా పడవల ద్వారా ఇవతల ఒడ్డు నుంచి అవతల ఒడ్డుకు వెళ్లాలంటే రవాణా చార్జీలు కూడా తక్కువ కావడంతో తెనాలి పరిసర ప్రాంతాల ప్రజలు పడవలనే ఆశ్రయిస్తున్నారు.

సురక్షితంగా ప్రయాణం...

గాజుల్లంక మత్స్యకారులు ప్రయాణికులను ఎంతో సురక్షితంగా శ్రీకాకుళం ఒడ్డుకు వారి ద్విచక్ర వాహనాలతోసహా చేరుస్తారు. కృష్ణానది మొత్తం వారికి కొట్టిన పిండి. ఎక్కడ లోతు, ఎక్కడ మెరకలు ఉన్నాయి, మెరకలు తగలకుండా ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా ప్రయాణికులను, వారి ద్విచక్ర వాహనాలను జాగ్రత్తగా చేరుస్తారు. పడవ నడిపే వారు చిన్నప్పటి నుంచి శిక్షణ పొందడం వలన ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు పడవ ప్రమాదాలు సంభవించలేదు. ఇందుకు ప్రధాన కారణం వారు తీసుకునే జాగ్రత్తలే. మర పడవ సామర్థ్యానికి మించి అధికంగా ప్రయాణికులను ఎక్కించరు.

పడవలు నడిపే వారంతా గజ ఈతగాళ్లే..

ఇక్కడ పడవలు నడిపేవారు చిన్నప్పటి నుంచి తమ పెద్దల వద్ద శిక్షణ పొందడంతోపాటు గజ ఈతగాళ్లు. కృష్ణానదిలో కొల్లిపర దిగువ నుంచి ఒలేరు వరకు ఎవరన్నా గల్లంతయితే పోలీసులు సైతం వారిని సంప్రదించి తీసుకు వెళ్తారు. గల్లంతయిన వారి మృతదేహాలను వెతికి తీసి అప్పగిస్తారు.

రెండు గ్రామాల వారికి ఉచిత ప్రయాణం

పడవ ప్రయాణం ఆ రెండు గ్రామాల ప్రజలకు ఉచితమే. గాజుల్లంక, శ్రీకాకుళం గ్రామాల ప్రజలు పడవ ప్రయాణం ఉచితంగా చేస్తుంటారు. ఇందుకు ప్రతి ఫలంగా మత్స్యకారులకు అవసరమైనప్పుడు తమ వంతుగా సహాయ సహకారాలు రెండు గ్రామాల ప్రజ లు అందిస్తుంటారు. మత్స్యకారులకు చేపల వేట విరామ సమయంలో ఈ రెండు గ్రామాల ప్రజల సహాయం ఊరటనిస్తుంది.

ఆ రెండు నెలలు పస్తులే...

చేపల వేట విరామ సమయంలో వారికి పస్తులు తప్పవు. అదే సమయంలో కృష్ణానదిలో నీటి ప్రవాహం లేకపోవడంతో పడవ ప్రయాణాలు కొనసాగవు. ఈ సమయంలో ఇతర పనులు కూడా ఉండవు. దీంతో ఆ రెండు నెలలు ప్రభుత్వ భృతితో సర్దుకుని జీవనం సాగించడం అలవాటుగా మారింది. భృతి కూడా ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి.



ధర్నా చేస్తున్న సిపాయి కాలనీ ఎస్టీలు

న్యాయం చేయాలని ఎస్టీల ధర్నా

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాము ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న స్థలాన్ని ఖాళీ చేయమనడం అన్యాయమని సిపాయికాలనీకి చెందిన ఎస్టీలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి రవికుమార్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. మంత్రి రవికుమార్ వెంటనే ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుని ఎస్టీల సమస్యను పరిష్కరించాలని, వెంటనే ఎస్టీలకు ఇచ్చిన పట్టాలను పరిశీలించి వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షునిగా పాపారావు



పాపారావు

చినగంజాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా గౌరవ అధ్యక్షునిగా సోపిరాల గ్రామానికి చెందిన సిద్ధం పాపారావు ఎన్నికయ్యారు. పాపారావు పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాపయ్యనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉన్నారు. బాపట్లలోని సూర్యకాళీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన స్వర్ణోత్సవ మహాసభ, నూతన కౌన్సిల్ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎల్ఎన్. మల్లేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నికలలో పాపారావుని జిల్లా గౌరవ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గత మూడు పర్యాయములుగా జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికవుతూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం చినగంజాంలో జరిగిన అభినందన సభలో పాపారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పాపారావుకి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెట్టు శ్రీనివాసరావు, షేక్ నాయబ్‌రసూల్, గౌరవ అధ్యక్షులు ఎస్.సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు సీ.హెచ్.వెంకట్, టీ.సౌజన్య తదితరులు అభినందనలు తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీలో ఇంకొల్లు ఉపాధ్యాయులు

ఇంకొల్లు : యూటీఎఫ్ జిల్లా కార్యవర్గంలో ఇంకొల్లు మండలానికి చెందిన ఉపాధ్యాయులకు అవకాశం దక్కింది. ఈ నెల 24న బాపట్లలో జరిగిన జిల్లా కార్యవర్గ ఎన్నికలో జిల్లా కార్యదర్శిగా ఇంకొల్లు మండలం దుద్దుకూరు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న యూ చెంచయ్య, జిల్లా మహిళా కార్యదర్శిగా గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వలేటి విజయలక్ష్మి, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా పావులూరు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న చిలుకూరి హనుమంతరావు ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపైకి దూసుకెళ్లిన బైకు

గణపవరానికి చెందిన అధ్యాపకుడు మృతి



బ్రిడ్జి వద్ద ఇనుప కడ్డీకి వేలాడుతున్న ప్రసాద్, ప్రసాద్ (ఫైల్)

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవేరోడ్ పనుల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపైకి ద్విచక్రవాహనం దూసుకుపోయి వ్యక్తి మృతి చెందిన సంఘటన చీరాల రోడ్డులోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికల సమాచారం మేరకు .. పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, గణపవరానికి చెందిన జంపని ప్రసాద్(38) చీరాలలోని ప్రైవేటు కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి చీరాల నుంచి తన స్వగ్రామం బైక్ మీద వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ బోర్డును గమనించకపోవడంతో ద్విచక్ర వాహనం నేరుగా బ్రిడ్జిలోకి దూసుకుపోయింది. దీంతో అతని తల కాంక్రీట్ గోడకు బలంగా ఢీకొనడంతోపాటు, బ్రిడ్జికి ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం కూడా పూర్తిగా దెబ్బతింది. ఉదయాన్నే మృతదేహాన్ని గుర్తించిన వాహనదారులు, బ్రిడ్జి నిర్మాణ కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మాల్యాద్రి తన సిబ్బందితో హుటాహుటినా చేరుకొని సిబ్బంది సహాయంతో లోయలో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. విషయం తెలుసుకున్న ప్రసాద్ కుటుంబ సభ్యులు చేరుకొని బోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పంచనామా అనంతరం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హక్కుల రక్షణకు ప్రత్యేక చర్యలు

డీఎస్పీ మొయిన్

చీరాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ బాధితులకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని వాటికి భంగం కలిగించకుండా సహకరించాలని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ పేర్కొన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూలన సమీకృత వ్యూహం(దిషా) హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, టీఐ చీరాల మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రివెన్షన్, కంట్రోల్ యాక్ట్ 2017పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాధితుల ఫొటోలు వైరల్ కాకుండా చూడాలన్నారు. బాధిత కుటుంబాలకు చెందిన పిల్లలకు స్కూల్స్ కళాశాలల్లో వివక్ష లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్సై సురేష్, చినగంజాం ఎస్సై రమేష్, కారంచేడు ఎస్సై వెంకటరావు, ప్రోగ్రాం మేనేజర్ వెంకటరావు, అవుట్ రీచ్ వర్కర్స్ పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

అద్దంకిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వద్ద భారతరత్న, మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానిగా వాజ్‌పేయి దేశంలో చేపట్టిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి పరుచూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్టిజన్ సెల్ కన్వీనర్ కొండమూడి బంగారు బాబు, జాగర్లమూడి యలమందరావు, టీడీపీ సీనియర్ నాయకులు సందిరెడ్డి రమేష్, కోనేటి అనిల్‌కుమార్, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఛైర్మన్ ఊటుకూరి రామకోటేశ్వరరావు, కముదాని శ్రీరామ్, ఎంఎల్ సుబ్రహ్మణ్యం, రమణ, వెంకన్న, ఫణి పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న బీజేపీ, టీడీపీ నాయకులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధిలో బోగస్ మస్టర్‌లు, బియ్యం అక్రమ తరలింపుపై ఉపేక్షించేది లేదు
- మంత్రి గొట్టిపాటి



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. సోమవారం బల్లికురవ మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామ సభకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ముందుగా శాఖలవారీగా ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, రాబోవు రోజుల్లో చేపట్టే సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. పనులు ఎక్కువ చేస్తేనే రోడ్లకు నిధులు మంజూరవుతాయన్నారు. గత వైసీపీ పాలనలో చేసినట్లు బోగస్ మస్టర్‌లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిజమైన కూలీలకు 100 రోజుల పని దినాలు కేటాయించాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిస్తే ఎంతటి వారైనా వదలొద్దన్నారు. రోడ్ల వెంబడి గ్రానైట్ వ్యర్థాలు వేస్తే సంబంధిత ఫ్యాక్టరీలు, క్వారీల వారికి నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. గోకులం షెడ్లు రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున మంజూరు చేయిస్తామన్నారు. అర్హులైన ప్రజలందరికీ పక్కా గృహాలు కేటాయిస్తామని, యూనిట్ ధర ఎంత అనేది ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉందన్నారు. జనవరి నుంచి నూతన పించన్‌లు మంజూరు చేస్తారన్నారు. ఎంపీడీవో కార్యాలయ నిధులను వైసీపీ హయాంలో అడ్డగోలుగా దోచుకున్నారని, నిధులు లేకుండా రెండు కోట్లకు తూతు మంత్రంగా మట్టి రోడ్లు వేశారని తక్షణమే అన్ని రోడ్లను పరిశీలించి పనులు నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లించాలని పంచాయతీ రాజ్ ఏఈ మాధవ్‌కు సూచించారు. తాగు నీరు అందించే సీపీడబ్ల్యూ పథకం ద్వారా పనిచేసే పథకాలకు తక్కువకు టెండర్ వేసే వారితో డిపాజిట్ చేయించుకోవాలని, ఎక్కడా నీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నదృష్ట్యా గ్రామాల్లో పర్యటించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎస్ఎల్ గుడిపాడులో ఉన్న సిపాయి కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను పూర్తి స్థాయిలో చేపట్టేలా నిధులను మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం మంత్రి రవికుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో కుసుమకుమారి, ఎంపీపీ శ్రీలక్ష్మీ, సర్పంచ్ అంజిబాబు, టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి లక్ష్మయ్య, చింతల శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి సమస్యల వెల్లువ

తొలిసారిగా వచ్చిన మంత్రికి పలు గ్రామాల ప్రజలు సమస్యలను చెప్పుకున్నారు. నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన రైతులు పశువైద్యశాలను బల్లికురవకు కేటయించాలన్నారు. బల్లికురవ - మార్టూరు రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. జూనియర్ కళాశాలకు బాలుర హాస్టల్‌ను మంజూరు చేయాలని కోరారు. కస్తూర్బా ఆటస్థలాన్ని అభివృద్ధి చేయాలని అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. అద్దంకి నుండి కొణిదెన చిలకలూరిపేట నైట్ బస్సును పునరుద్ధరించాలని, వల్లాపల్లి పాఠశాలలో అదనపు తరగతి గదులను నిర్మించాలని ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తెచ్చారు.

సీఎం సహాయం అందజేత

నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 55 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను మంత్రి గొట్టిపాటి అందజేశారు. రూ.కోటీ 11అక్షల 32వేలకు ఎల్‌వోసీలను అందజేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 123 మందికి రెండు కోట్ల మేర చెక్కులను అందజేసిన్నట్లు మంత్రి తెలిపారు.

తేమ సాకు.. రైతుకు షాకు

(5వ పేజీ తరువాయి)

గుబులుతో కోత కోయటం ఆలస్యం ధాన్యాన్ని చేను నుంచి దాటించేస్తున్నారు. అయితే ఇక్కడే తేమ శాతాలతో చిక్కు వచ్చిపడింది.

బస్తాకు రూ. 200పైన ఎదురు వసూళ్లు

రైతు పండించిన ధాన్యం అమ్మితే కొన్న వ్యాపారి కానీ, మిల్లర్లు కానీ రైతుకే డబ్బు చెల్లించటం సహజం. అయితే ఇప్పుడు పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. తాను పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్ముకోవాలంటే ఎదురు డబ్బు కట్టాల్సి వస్తోంది. వరి కోతలు మొదలయిన తరుణంలో ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం 75 కిలోల బస్తా ఎ గ్రేడ్ రకానికి రూ. 1740, సాధారణ రకం ధాన్యానికి రూ. 1725గా ధర నిర్ణయించింది. అదే బయట మార్కెట్‌లో అయితే యంత్రాలతో కోసిన ధాన్యానికి ఎంత తేమ ఉన్నా బస్తా రూ. 1300 నుంచి రూ. 1400 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర దీనికి మించి ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాలకే అమ్మేందుకు ఇష్టపడుతున్నారు. అనుకున్నట్టే మార్కెటింగ్ శాఖ చూపిన ప్రకారం ధాన్యం అమ్మేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన ప్రక్రియ అంతా బాగానే ఉన్నా, తీరా మిల్లర్ దగ్గరకు వెళ్లేసరికి రైతుకు సమస్య ఎదురవుతోంది. తేమ 17 శాతంలోపు ఉంటే మాత్రం ఏ ఇబ్బందీ పెట్టటంలేదు. సమస్యంతా తేమ ఎక్కువగా ఉండే ధాన్యానికే. 18 నుంచి 21 శాతం వరకు తేమ ఉంటుండటంతో మిల్లర్లు కొనుగోలు చేయమని చెప్పకుండా, రైతుల నుంచి ముందస్తుగానే వసూళ్లకు దిగుతున్నారు. తేమ శాతం 17 నుంచి 19 శాతం ఉంటే బస్తాకు రూ. 200 చొప్పున, 20 నుంచి 21 శాతం తేమ ఉంటే రూ. 300పైన ఎదురు కట్టాలని రైతుల నుంచి నిలబెట్టి వసూలు చేస్తున్నారని, చెబుతున్నారు.

బస్తాకు రూ. 200 నుంచి రూ. 300 ఎదురు కట్టాల్సి రావటం ఇబ్బదిగా ఉందని, అదే ప్రభుత్వమే రేటులో కోత విధిస్తే, మిల్లర్లకు ఎదురు కట్టే పరిస్థితి ఉండదని, పైగా వారు మద్దతు ధరలో కోతకోసి దోపిడీ చేయకుండా తెరపడుతుందని, రైతులకు మేలు జరుగుతుందనేది రైతుల మాట. 75 కిలోల బస్తాకు ఎంత తేమ ఉంటే ఎంత తరుగుదల ఉంటుందనే అంశాన్ని వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో నిర్ణయించి రేటు నిర్ణయిస్తే చాలావరకు మేలు జరుగుతుంది. రైతుల నిలువుదోపిడీ లేకుండా పోతుంది. త్వరలో రైతు సంఘాల నాయకులు కూడా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ దగ్గరకు తీసుకువెళ్లాలనే ఆలోచనకు వచ్చినట్లు చెబుతున్నారు. దీనిపై మరోసారి పునరాలోచించాలనేది రైతుల విన్నపం.

రహదారులకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

తెనాలి రోడ్డు దుగ్గిరాల వద్ద, చిలకలూరిపేట- పెదనందిపాడు రోడ్డు, వట్టిచెరుకూరు- పొండ్రపాడు, యర్రగుంట్లపాలెం- తుళ్లూరు, కాజ- ఉప్పలపాడు, గుంటూరు- హనుమాన్‌పాలెం, తెనాలి నారాకోడూరు రోడ్లను నిర్మించనున్నారు.

పల్నాడు జిల్లాకు

పల్నాడు జిల్లాలో తక్షణ మరమ్మతుల కోసం భారీగా నిధులు కేటాయించారు. ఏడు నియోజకవర్గాల్లో జిల్లా ప్రధాన రహదారుల మరమ్మతుల నిమిత్తం 4.86 కోట్లు కేటాయించారు. అత్యధికంగా గురజాల నియోజకవర్గానికి 1.12 కోట్లు కేటాయించగా, చిలకలూరిపేటకు 93.7 లక్షలు, నరసరావుపేటకు 89.6 లక్షలు, మాచర్లకు 85 కోట్లు చొప్పున కేటాయించారు. వీటితోపాటు అత్యవసర మరమ్మతుల కింద 567.8 కిలో మీటర్ల రహదారుల్లో 82 పనులకు మొత్తం 22.44 కోట్లు కేటాయించారు. వీటిలో 72 మరమ్మతులకుగాను 3.44 కోట్లు, 371 కి.మీ మేర ప్యాచ్ వర్కుల నిమిత్తం 11.57 కోట్లు, రోడ్డు అంచుల ప్యాచ్ వర్కుల కోసం 94.5 లక్షలు, కంపచెట్ల తొలగింపు కోసం 91.7 లక్షలు, వర్షపు నీటికి దెబ్బతిన్న రోడ్లకు 4.15 కోట్లు కేటాయించారు. ప్రధానంగా రొంపిచర్ల, చిలకలూరిపేట, మాచర్ల, దాచేపల్లి, పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ, శావల్యాపురం, కారెంపూడి, గురజాల, పిడుగురాళ్ల, క్రోసూరులలో ఈ రోడ్లకు మరమ్మతులు చేయించనున్నారు.

బాపట్ల జిల్లాకు రూ. 72.5 కోట్లు

బాపట్ల జిల్లాలో బాపట్ల- రేపల్లె సబ్ డివిజన్లో 217 కి.మీ మేర రాష్ట్ర రహదారులు, 599.6 కి.మీ మేర జిల్లా ప్రధాన రహదారులకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. జిల్లా రహదారు మరమ్మతులకు సంబంధించి కోటిన్నర రూపాయలతో ఇప్పటికే పనులు పూర్తి చేశారు. కేంద్ర రహదారుల నిధుల కింద రూ. 36.31 కోట్లతో 60.35 కి.మీ మేర రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ. 8.91 కోట్లతో 5.97 కి.మీ మేర రోడ్లు నిర్మిస్తున్నారు. వాటితోపాటు రేపల్లె- నిజాంపట్నం మధ్య రెండు చోట్ల పైప్ కల్వర్టులు, గుంటూరు చీరాల మధ్య మరో కల్వర్టు నిర్మిస్తున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో కట్రపాడు- శంకరపురం రోడ్డు, రావినూతల రోడ్డు, రేపల్లె- నిజాంపట్నం రోడ్డు, పర్చూరు వంకాయలపాడు- కొడవవలివారిపాలెం రోడ్డు, చీరాల- దగ్గుబాడు రోడ్డు, గన్నెపూడి- తిక్కరాజుపాలెం, నూతలపాడు- కారంచేడు, కారంచేడు- ఇంకొల్లు, పందిళ్లపల్లి- కడవకుదురు, వేటపాలెం, సంతరావూరు, జాండ్రపేట- వేటపాలెం, పర్చూరు- ఇంకొల్లు, వేమూరులో వెల్లటూరు- జువ్వలపాలెం, గాజుల్లంక- చింతమోటు, చినపులివర్రు- రావికంపాడు, తెనాలి- వెల్లటూరు, బాపట్లలో కాజీపాలెం- బుద్ధం మొత్తం 22 పనులకు రూ. 1.15కోట్లు కేటాయించారు. వీటితో పాటు 14 చోట్ల జంగిల్ క్లియరెన్సు పనుల నిమిత్తం 71.28 లక్షలు కేటాయించారు.

ఎమ్మెల్యే ఏలూరికి అభినందనలు

చినగంజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ పార్లమెంట్ నుంచి విజనరీ లీడర్-2024 అంతర్జాతీయ పురస్కారం పొందిన పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుకి చినగంజాం గ్రామ టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో చినగంజాం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు కేకు కట్ చేశారు. కేకు కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు చెరుకూరి రాఘవయ్య, నాయకులు తుమ్మలపెంట జయరావు, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, పర్వతరెడ్డి పార్థసారిథి, నరహరి శ్రీనివాసరావు, షేక్ జిలాని, గుండ్రెడ్డి నరసింహారావు, భయ్యా సతీష్, షేక్ నబీషా, ఎం.లక్ష్మయ్య, మన్యం పద్మ, మాచవరపు రామాంజనేయులు, గంటా వెంకటనారాయణ, జి.నరసింహారవు, టీ.వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, ఎస్.సూరిబాబు, చేవూరి రవణమ్మ, ఉదయ్ భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

మేదరమెట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మేదరమెట్లలోని బీసీ సంక్షేమ హస్టల్‌లో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చలి తీవ్రత అధికంగా ఉన్నందున దుప్పట్లు ఇతర వసతులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పెట్టే ఆహార మెనూను కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టపడి చదివి కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. మీరు మీతో పాటు మీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్యే దానికి మార్గమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్‌వో ప్రియాంక, ఇన్‌చార్జి వార్డెన్ సుమలత, హస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పూర్తి దివ్యాంగులుగా బాధ పడుతున్న వారికి ప్రభుత్వం చేయూతను ఇస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. సోమవారం బల్లికురవ వచ్చిన అయన కాన్పూర్ ఆర్టిఫిషియల్ కార్పొరేషన్ నెల్లూరు వారి ద్వారా బల్లికురవ మండలంలోని నలుగురు దివ్యాంగులకు అందించిన బ్యాటరీ సైకిళ్లను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా తమకు ట్రై సైకిళ్లు కావాలంటే వెంటనే దరఖాస్తు చేసుకొంటే వెంటనే మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు దమ్ము అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

అద్దంకిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం నేత్రదానం జరిగింది. పట్టణంలోని కొత్తపేటకు చెందిన మీరా పాన్ షాపు యజమాని, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తండ్రి షేక్ మీరాసాహెచ్(85) సోమవారం మృతి చెందారు. మీరాసాహెబ్ కుటుంబ సభ్యుల అంగీకారంతో రోటరీ కార్యదర్శి నేత్ర విభాగం డైరెక్టర్ చుండూరి మురళీసుధాకరరావు సమాచారంతో పెద్ద కాకాని శంకర్ నేత్రలయం వైద్యులు డాక్టర్ సందీప్ బృందం మీరా సాహెబ్ కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, ఊటుకూరి రామకోటేశ్వరరావు షేక్ అంజాద్ బాషా పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

క్షతగాత్రులు కర్నూలు వాసులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

బేస్తవారపేట, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్వ్యూకు హాజరై కారులో తిరిగి సొంతూరికి వెళ్తున్న వారిని ట్రాక్టర్ రూపంలో ప్రమాదం వెంటాడింది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతిచెందగా, ముగ్గురు గాయపడ్డారు. బేస్తవారపేట మండలం శాంతినగర్ వద్ద సోమవారం వేకువజామున ప్రమదం చోటుచేసుకొంది. కర్నూలుకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో ఒంగోలుకు వచ్చారు. అక్కడ ఓ ఇంటర్వ్యూకు హాజరై తిరిగి కర్నూలుకు వెళుతున్నారు. అమరావతి- అనంతపురం జాతీయ రహదారిపై మండలంలోని శాంతినగర్ వద్ద తెల్లవారుజామున 5గంల ప్రాంతంలో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను గమనించకుండా వెనుకభాగంలో ఢీకొట్టారు. దీంతో వీరు ప్రయాణిస్తున్న కారు నుజ్జు నుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న పటాన్ ఇమ్రాన్‌ఖాన్(35) అక్కడికక్కడే మృతిచెందాడు మిగిలిన మృతుని తమ్ముడు పటాన్ ఇర్ఫాన్‌ఖాన్, అల్తాఫ్ మాష్, ఖాజాబాషాలు గాయపడ్డారు. వీరిని 108 ద్వారా గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏఎస్ఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు ముళ్లకంచె



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కంచెను ఏర్పాటు చేస్తున్న సెక్రటరీ

తోటవారిపాలెం(చీరాలటౌన్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారిపాలెంలో ఆరేళ్ల బాలుడు మృత్యుంజయుడిగా నిలిచాడు. అవగాహన లేమితో ఆడుకుంటూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకాడు. అయితే స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఈఘటన ఆదివారం ఇందిరా కాలనీలో జరగగా స్పందించిన పంచాయతీ కార్యదర్శి మేడికొండ భారతి సిబ్బంది సహాయంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. స్థానికులతో మాట్లాడి చిన్న పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే విద్యుత్ రూరల్ ఏఈ ఎల్ బ్రహ్మం కూడా స్పందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రక్షణ వలయం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అయితే ఈ ఘటన రెండు రోజులుగా ఆ ప్రాంతంలో హాట్ టాపిక్‌గా నిలిచింది.

మట్టి కొల్లగొట్టి!



తిప్పబీడు భూమిలో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్‌లోకి నింపుతున్న మట్టి

- అనుమతులు లేకుండా ఇష్టారీతిన భారీ వాహనాల్లో తరలింపు
- అడ్డుకున్న తూర్పుగంగవరం గ్రామస్థులు
- చోద్యం చూస్తున్న అధికారులు

తాళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):హైవే పనుల కోసం అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలకు కొందరు తెగబడుతున్నారు. అనుమతులు లేకుండా ఇష్టారీతిన భారీ వాహనాలలో తరలిస్తున్నారు. యథేచ్ఛగా సాగుతున్న వ్యవహారాన్ని అధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. మట్టి తవ్వకాలు మండలంలోని నాలుగు కొండలలో విచ్చలవిడిగా సాగుతుండగా సోమవారం తూర్పుగంగవరంలో మాత్రం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామ ఉమ్మడి తిప్ప బీడు భూమిలోని మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం తూర్పుగంగవరం గ్రామస్థులు అడ్డుకున్నారు. తిప్పబీడులో మట్టి తోలేందుకు ఉన్న యంత్రాలను ఆ భూమి నుంచి బయటకు పంపటంతో తాత్కాలికంగా తరలింపు నిలిచిపోయింది. మండలంలోని నాగంబొట్లపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 299లోని తిప్పబీడు భూమి 190.50 ఎకరాలు (పశువుల మేత భూమి) తూర్పుగంగవరం గ్రామస్థుల ఉమ్మడి బీడుగా ఉంది. ఇది అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు పూర్వం గ్రామానికి చెందిన ఏడుగురు పెద్దల పేర్ల మీద పట్టాదారులుగా రెవెన్యూ రికార్డులో ఎఫ్ఎల్ఆర్ నమోదు చేశారు. ఆ భూమిలో అనాది నుంచి మూడు, నాలుగు గ్రామాలకు చెందిన పశువులు మేస్తూ ఉంటాయి.

హైవే నిర్మాణానికి మట్టి తరలింపు

అయితే, ముప్పవరం-బెంగళూరు హైవే నిర్మాణంలో భాగంగా పట్టాదారులకు చెందిన ఇద్దరితో సంప్రదించి ఉమ్మడి తిప్పబీడులోని గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఇది ఉమ్మడి బీడు భూమిగా ఉంది. కాగా పట్టా హక్కుదారులకు చెందిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో సంప్రదించి, ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకుని మైనింగ్ అనుమతి పొందాలి. ఆ తర్వాతే గ్రావెల్ తోలుకోవాలి. అయితే, ఉమ్మడి బీడుకు సంరక్షణగా ఉన్న పట్టాదారుల్లో కొందరు హైవే నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌తో లాలూచి పడి గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ భూమిని సంరక్షించేందుకు ఏడుగురు పెద్దల పేర్ల మీద పట్టాలు ఉన్నా, వారిలో కొందరు చెప్పినట్లుగా గ్రావెల్ తరలిస్తుండటంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండానే ఇష్టారీతిగా గ్రావెల్‌ను తరలించడాన్ని ప్రశ్నించారు. సొంత అవసరాలకు, గృహాల వద్ద చదును కోసం గ్రావెల్ తరలిస్తే నానా హడావుడి చేసే మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు భారీయంత్రాలతో, అధిక సంఖ్యలో టిప్పర్లలో సమీప రోడ్డుకు గ్రావెల్ తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు.



మట్టి తవ్వకాలను అడ్డుకున్న తూర్పుగంగవరం గ్రామస్థులు

అనుమతులు లేకుండా

పూర్వం నుంచి ఉమ్మడి తిప్పబీడు(పశువుల మేతభూమి)లో నాగంబొట్లపాలెం, రామభద్రాపురం, సోమవరప్పాడు తూర్పుగంగవరం తదితర గ్రామాలకు చెందిన పశువులు, గొర్రెలు, మేకలు మేతకు వెళుతుంటాయి. ఈ బీడు నుంచి గ్రావెల్ తరలిస్తే భవిష్యత్తులో మేతకు ఇబ్బందిగా ఉంటుందని గ్రామస్థులు ఆందోళన చెంది పనులు అడ్డుకున్నారు. హైవే రోడ్డు నిర్మాణం పేరిట పనులు చేపడుతున్న కంపెనీ వారు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రామస్థులు అనుమతి పత్రాలు చూపమన్నా చూపలేదు. దీంతో యంత్రాలను, టిప్పర్లను ఆ ప్రాంతం నుంచి బయటకు పంపివేశారు. హైవే రోడ్డు కాంట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకున్న వారు గ్రావెల్ తరలింపును అడ్డుకున్న వారిని ప్రశ్నించటంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఉమ్మడి బీడుగా ఉన్న పశువుల మేతభూమిలో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

మంత్రి రవికుమార్ పిలుపు

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటే కార్యకర్తలకు భరోసా ఉంటుందని, ఏదైనా ప్రమాదాలు జరిగితే పార్టీ వారికి అండగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం బల్లికురవ మండల పార్టీ కార్యాలయంలో అన్ని గ్రామాల టీడీపీ నేతలతో మంత్రి రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన కల్పించి అత్యధికంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కొన్ని గ్రామాలలో కార్యకర్తలే ముందుకు వచ్చి నమోదు చేసుకుంటున్నారన్నారు. డిసెంబర్ 2 వతేదీ నాటికి నమోదు పూర్తి కావాలని నాయకులకు సూచించారు. అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ పార్టీకి ఉన్న ఆదరణ సభ్యత్వ నమోదు ద్వారా చేసి చూపించాలన్నారు. గ్రామాలలో పార్టీ బలోపేతానికి తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో మండల పార్టీ నేతలు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, తేలప్రోలు రమేష్, గొట్టిపాటి లక్ష్మయ్య, ఆళ్ల చంద్రమౌళి, ముంద్రు దానయ్య పలు గ్రామాలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- మణికేశ్వరానికి పోటెత్తిన భక్తులు
- పలుచోట్ల అన్నదానాలు


మార్టూరులో ఘట్టేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో చిదంబరేశ్వరస్వామి

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మణికేశ్వరానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి కార్తీక దీపాలను వెలిగించా రు. దేవస్థానానికి వచ్చిన భక్తులకు గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసా దాన్ని పంపిణీ చేశారు. ఈవో వాసుబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీడీ పీ నేతలు షేక్ కరిమూల్లా ముత్తంశెట్టి ఆశోక్, మౌలాలి, అబ్దుల్లా, ఆదినారాయణ పాల్గొన్నారు.

చినగంజాం : కార్తీక మాస సోమవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పరమ శివుని మదినిండా కొలిచారు. స్వామివార్లకు రుద్రాభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేశారు. మండలంలోని చినగం జాం గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆల యం, కడవకుదురు గోకర్ణేశ్వరస్వామి ఆలయం, సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, పెదగంజాం, నీలాయపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లోని త్రినేత్రుడుని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రాలు, ఆలయాలు భక్తి పారవశ్యంతో ఉప్పొంగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపారాధనలు చేశారు. ఆలయాలు కార్తీక దీపాల వెలగులతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.

దగ్గుబాడు(పర్చూరు) : కార్తీక మాసం చివరి సోమవారం శివాలయాలు కిక్కిరిసాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. కారంచేడు మండల పరిధిలోని దగ్గుబాడు శివాలయంలో పెద్ద ఎత్తున భక్తులు పూజలు చేశారు.

మార్టూరు : వేకువజామునే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా మహిళలు దేవస్థానం ఆవరణలో పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో స్వామి వారితోపాటు, అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న దుర్గామల్లీశ్వరి దేవస్థానంలో దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంకొల్లు : ఘంటసాల స్మారక సమితి ఆధ్వర్యంలో కోటిదీపోత్సవం, సహస్ర లింగార్చన జరిగింది. వేదపండితులు సమితి అధ్యక్షుడు ఓరుగంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూర్ణారామశాస్త్రి, వెంకటేశ్వరశాస్త్రి, షణ్ముఖ శర్మ, శివ, ప్రసాద్ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దీపోత్సవం చేసి అన్నదానం ఏర్పాటు చేశారు.


క్వారీలో పనులను పరిశీలిస్తున్న చక్రబోర్తి

గనుల వద్ద అప్రమత్తం

డీడీఎంఎస్ అధికారి చక్రబోర్తి

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ గనులలో పనుల వద్ద కార్మికులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ రీజియన్ 2 డైరెక్టర్ అఫ్ మైన్స్ సేఫ్టీ (డీడీఎంస్) సుప్రియో చక్రబోర్తి అన్నారు. సోమవారం వీర్ల కొండ వద్ద గల గిరిరాజ్ గ్రానైట్ క్వారీని డీడీఎంస్ అధికారులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా క్వారీలో చేపడుతున్న పనులను పరిశీలించారు. భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఆయన క్వారీ లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందితో మాట్లాడుతూ గనులలో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తగా ఉండాలన్నారు. పనుల వద్ద ఫస్టు క్లాసు మేనేజర్ అందుబాటులో ఉండాలన్నారు. బ్లాస్టింగ్ సమయంలో నలువైపులా ఉన్న క్వారీలకు సమాచారం అందించాలన్నారు. క్వారీలలో పొల్యూషన్ రా కుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీలో వీటీసీ బాధ్యులు సుభాస్కర్‌రెడ్డి, క్వారీ యజమానులు రావిపూడి లక్ష్మీన్నారాయణ, పత్తిపాటి సురేష్, మాలపాటి పోతురాజు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపాలపురంలో అసంపూర్తిగా ఉన్న నామ్ రోడ్డులోని గోతులలో పడి మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. బల్లికురవ మండలం వి.కొప్పెరపాడుకు చెందిన షేక్ అబీబ్ మరో వ్యక్తితో కలిసి మోటార్ సైకిల్‌పై అద్దంకి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా గోపాలపురం వద్ద అసంపూర్తిగా ఉన్న నామ్‌రోడ్డుపై గోతులలో బైకు అదుపు తప్పి పడిపోయారు. దీంతో అబీబ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ

పర్చూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) :పర్చూరు మండలం నాగులపాలెం బీఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు రోటరీక్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణ మోహన్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన ఆట వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు ఆటల్లో కూడా రాణించాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వరాణి, క్లబ్ కార్యదర్శి కోమటి అంజనేయులు, సభ్యులు కొల్లా సుబ్బారావు, పోలిశెట్టి చంద్రం, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కోనంకిలో మళ్లీ చర్చి వివాదం

మార్టూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనంకి ఎస్సీ కాలనీలో తెలుగు బాపిస్టు చర్చి వివాదం మళ్లీ సోమవారం రాత్రి రాజుకున్నది. ఈ చర్చిలో పాస్టర్ నియామకంపై రెండు గ్రూపుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తుండగా ఏడాదికి పైగా చర్చిని మూసివేశారు. గత రెండు నెలలు కిందట కాలనీలోని పెద్దలు, గ్రామ పెద్దలు సమన్వయంతో మరల చర్చి తలుపులను తెరవడంతో చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి ఒక గ్రూపు వారు రెండో గ్రూపు వారితో కోర్టులో తమ పేర్లు ఎందుకు ఫిర్యాదు చేశారనే విషయంపై వివాదం రాజుకుంది. విషయం తెలుసుకున్న సీఐ ఎం.శేషగిరిరావు, ఎస్‌ఐ సైదా రెండు గ్రూపుల వారిని సమన్వయం చేయడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.

ఆరుగురు జూదరుల అరెస్టు

పర్చూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని ఏదుబాడులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఎస్సై మాల్యాద్రి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టుచేసి, రూ.7200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

గుప్త నిధుల కోసమా?

గోపాలపురంలో క్షుద్రపూజల కలకలం



పూజ సామగ్రి, పూజ చేస్తున్న వ్యక్తి

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అపరిచిత వ్యక్తులు శింగరకొండ దిగువ భాగంలో నామ్ రోడ్డు వెంబడి అర్ధ రాత్రి సమయంలో పూజలు నిర్వహించడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. అద్దంకి మండలంలోని గోపాలపురం సమీపంలో శింగరకొండ దిగువన రాజమండ్రి, నంద్యాల తదితర ప్రాంతాలకు చెందిన కొత్త వ్యక్తులు ఆదివారం రాత్రి పూజలు చేశారు. విషయం తెలుసుకున్న గోపాలపురం గ్రామస్థులు అక్కడకి వెళ్లి ప్రశ్నించేందుకు ప్రయత్నించగా వారిపై వారు రాళ్లదాడికి ప్రయత్నించారు. దీంతో మరి కొంత మంది గ్రామస్థులను కలుపుకొని మూకుమ్మడిగా వెళ్లగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. మరో ఇద్దరు పరారయ్యారు. దొరికిన వ్యక్తులను గ్రామస్థులు ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానానికి తావిస్తుంది. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చి ఆ నలుగురినీ అప్పగించినట్లు సమాచారం. పోలీసుల విచారణలో అసలు విషయం తెలియాల్సి ఉంది. శింగరకొండ మీద గుప్త నిధులు ఉండి ఉంటాయన్న అనుమానంతో పూజలు నిర్వహించి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతుండగా, మరి కొందరు మాత్రం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రోద్బలంతో క్షుద్రపూజలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

పాత నేరస్థుల బైండోవర్

చీరాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సోమవారం ఏడుగురు పాత నేరస్థులను ఎక్సైజ్ పోలీసులు చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ వద్ద బైండోవర్లు చేశారు. ఈసందర్భంగా అధికారులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలను వీడి మానవ మనుగడలో సంతోషంగా జీవించాలని సూచించారు. పునరావృతమైతే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రికార్డులను విధిగా నిర్వహించాలి


రికార్డులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

చీరాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్యాలయ పరిధిలోని రికార్డులను విధిగా నిర్వహించాలని అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం చీరాల ఎక్సైజ్ కా ర్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రికార్డుల ను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాత బకాయిలు, ఆఫ్ టేక్ మద్యం నిల్వలపై ఆరా తీశారు. కేసులకు సంబంధించి పూర్వాపరాలపై రివ్యూ నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో సీఐ నాగేశ్వరరావు, ఎస్సై శ్రీహరి స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శనగ రైతు దిగాలు

ఇంకొల్లు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది శనగపంట సాగు చేసి శీతల గిడ్డంగులలో నిల్వ చేసుకున్న రైతులు దిగాలు చెందుతున్నారు. రోజుల కిందట జేజే11 రకం శనగలు క్వింటా రూ.7300 పలకింది. ఆ సమయంలో నిల్వలు ఉంచుకున్న రైతులు రూ.8వేలకు చేరుకుంటుందని ఆశతో అమ్మలేదు. ప్రస్తుతం శనగ చేతికందిన సమయంలో ఉన్న ధర దిగొచ్చి రూ.6400 పలుకుతోంది. కాక్-2 రకం శనగలు నెల కిందట క్వింటా రూ.10,500 పలకగా ప్రస్తుతం రూ.2వేలు తగ్గి క్వింటా రూ8,500 ఉంది.


మాట్లాడుతున్న ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం వాణిశ్రీ

ప్రకృతి సాగు పంటలతో ఆరోగ్యం

అద్దంకిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విధానంలో పంటలు సాగు చేసి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం వాణిశ్రీ అన్నారు. సోమవారం అద్దంకిలోని వెలుగు కార్యాలయంలో ఫుడ్ బాస్కెట్ కార్యాచరణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న సరుకులు కల్తీగా ఉన్నాయని, ఆ సరుకులు వాడి హస్పిటల్‌కు లక్షల రూపాయలు ఖర్చుచేసి ఆర్థికంగా నష్టపోతున్నారని డాక్టర్ రాజ్‌గోపాల్ అన్నారు. ప్రకృతి సాగుకు అవసరమైన రుణాలను గ్రామ సంఘం నుంచి ఇస్తారని, వాటిని రెండు నెలల్లో తిరిగి చెల్లించాలని ఏపీఎం కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, ఫుడ్ బాస్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

పంగులూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ పీ సింగారావు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా వేదికలో తహసీల్దార్‌కు 15 మంది పలు సమస్యలపై అరీజలను అందజేశారు. తూర్పు కొప్పెరపాడులో సర్వేనెంబరు 125-1లో తన రెండెకరాల వ్యవసాయభూమికి హద్దులు చూపాలని కోరగా, గ్రామ సర్వేయర్ ఎన్నెస్పీ పంటకాలువలో భూమిని చూపిస్తున్నారని గ్రామానికి చెందిన కొర్రపాటి భూలక్ష్మి ఫిర్యాదు చేశారు. న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. డిజిటల్ సైన్‌తో పాటు విస్తీర్ణ వ్యత్యాసాలు, ఇతర సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



ట్యాంకర్ నుంచి తాగునీటి పట్టుకుంటున్న వార్డువాసులు

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ట్యాంక్ మరమ్మతుల నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశానుసారం సోమవారం 29 వార్డు నాయకులు నరాల తిరుపతిరాయుడు, పల్లా సుబ్బారావు తదితరుల చొరవతో ట్యాంకర్ల ద్వారా వార్డు ప్రజలకు తాగునీటిని సరఫరా చేశారు. దీంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బత్తుల వెంకటరఘునందన్, అనంద్, అన్నం వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ప్రజాబంధు ప్రగడ కోటయ్య వర్ధంతి

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాబంధు ప్రగడ కోటయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహం వద్ద సభను నిర్వహిస్తున్నట్లు ప్రగడ కోటయ్య యూత్ వలంటరీ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు సోమవారం తెలిపారు. ముందుగా కోటయ్య విగ్రహానికి ఉదయం 9 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతర సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాలకు ఫ్యాన్ బహూకరణ

పంగులూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి గోళ్లమూడి భాస్కరరావు ఫ్యాన్‌ను బహూకరించారు. పాఠశాల ప్రహరీ నిర్మాణం, వంటగది ఏర్పాటు, మెరకతోలే విషయంలో ఆయన సహకరించారని విద్యా కమిటీ మాజీ చైర్మన్ వెంకటరావు, హెచ్ఎం వడ్లమూడి వేణుబాబు అభినందించారు.

ఉసిరిచెట్టుకు స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు


ఉసరిచెట్టుకు మొక్కుతున్న ఆలయ పూర్వ కమిటీ ప్రతినిధులు

వేటపాలెం(చీరాల), నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : రామన్నపేట పంచాయతీ పరిధిలోని నాగవరపమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఉసరి చెట్టుకు దాతల సహకారంతో స్టీల్ రెయిలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఆ రెయిలింగ్‌ను సోమవారం ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెయిలింగ్ కోసం దాతలు పింజల పమేశ్వరరావు రూ.50వేలు, వేళ్ల వెంకట శివరామకృష్ణప్రసాద్ దంపతులు రూ.25వేలు, ఆమంచి వెంకటస్వామి దంపతులు రూ.7,500, పిచ్చుక మహాలక్ష్మయ్య దంపతులు రూ.5,000 మొత్తం రూ.82,500 వ్యయంతో ఆ రెయిలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పోతిని శ్రీనివాసరావు, ఆలయ పూర్వ కమిటీ ప్రతిధులు ఏ.భానుమూర్తి, బండ్ల బాబు, దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కూర్మా రాహుల్జి, కార్యదర్శి యారాజు అరుణ బాబు, ఆలయ సిద్ధాంతి దోగుపర్తి కోటసుబ్బారావు, చల్లా విజయ్, నాసిక జగన్, గణపతి, రవీంద్రబాబు, శివకుమార్ పాల్గొన్నారు.

వివక్షలేని సమాజంతోనే ప్రగతి


పర్చూరులో మాట్లాడుతున్న సీడీపీవో సుభద్ర

పంగులూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వివక్ష లేని సమాజంతోనే ప్రగతి సాధ్యమని వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. జండర్ వాలోత్సవాలలో భాగంగా సోమవారం పంగులూరులో స్త్రీశక్తి భవన్ నుంచి వెలుగు అధికారులు, వీవోఏలు అవగాహన ర్యాలీని చేపట్టారు. సమాజంలో ఆడ, మగ బేధం లేకుండా పుట్టిన ప్రతి బిడ్డకూ సమాన అవకాశాలు కల్పించి వారి అభివృద్ధికి తల్లిదండ్రులు తోడ్పాటును అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీసీలు సాల్మన్, సురేష్, చంద్రశేఖర్, భాస్కరమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంపై గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ మహిళలకు అవగాహన కల్పించాలని ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. సోమవారం వెలు గు కార్యాలయం వద్ద జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా గ్రూపు మహిళలతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. లింగ వివక్ష, మహిళలు, పురుషుల మధ్య అసమానత్వం, మహిళలపై జరిగే లైంగిక దాడులకు వ్యతిరేకంగా ఈనెల 25 డిసెంబర్ 25 వరకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

పర్చూరు : లింగ వివక్ష చట్టరీత్యా నేరమని ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలని ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర అన్నారు. లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెలుగు కార్యాలయంలోని స్వయం సహాయక సంఘాల కార్యకర్తలకు బాల్య వివాహాల నియంత్రణ చట్టంపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు జరగకుండా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే తక్షణమే సమాచారం ఇచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏపీఎం రామకృష్ణ, సిబ్బంది ప్రమీల, విజయ కుమార్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.


పడి పూజ నిర్వహిస్తున్న గురుస్వామి

వైభవంగా అయప్పస్వామి పడి పూజ

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 19 వార్డు కౌన్సిలర్ ఏజెండ్ల నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అయప్పస్వామి పడి పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. వాసు గురుస్వామి ఆధ్వర్యంలో అయప్పకు పడిపూజ, అభిషేకాలు నిర్వహించారు. అయప్ప, శివమాల, కనకదుర్గమ్మ, హనుమాన్ దీక్షదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వెంకటేష్ బృందం భజన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఐకమత్యంగా ఉందాం

వేటపాలెం(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అందరం ఐకమత్యంగా ఉందాం. పరస్పరం సహకరించుకుందామని పలువురు రెడ్డిసామాజికవర్గ ప్రతినిధులు పేర్కొన్నారు. రామన్నపేట పంచాయతీ పరిధిలోని కనకనాగవరమపమ్మ ఆలయ ప్రాంగణంలో జాగృతి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో రెడ్డి సంఘీయులు పాల్గొన్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

హెచ్‌ఐవీ రోగులపై వివక్ష చూపొద్దు

మార్టూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ రోగులను వివక్షతో చూడకుండా అండగా నిలవాలని డీఆర్డీఏ ఏపీఎం సురేంద్ర బాబు అన్నారు. సోమవారం మార్టూరులో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ వారు స్వయంసహాయక గ్రూపులకు చెందిన వీవోలకు వారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.


ప్రారంభమైన రోడ్డు పనులు

ఏలూరి చొరవతో రోడ్డుకు మరమ్మతులు

ఇంకొల్లు,నవంబరు 25,(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో మండల పరిధిలో అధ్వానంగా ఉన్న రహదారుల మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఇంకొల్లు నుంచి పంగులూరు గంగవరం రహదారికి మరమ్మతు పనులు గత రెండు రోజులుగా వేగవంతంగా జరుగుతున్నాయి. ఆరికట్లవారిపాలెం వైపు నుంచి పనులు సాగుతున్నాయి. ప్రయాణ ఇబ్బందులు గుర్తించి రోడ్డు మరమ్మతులకు ఆదేశించిన ఎమ్మెల్యే ఏలూరికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సామూహిక సత్యవ్రతాలు

చీరాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠపురంలోని కోదండ రామాలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, కలశ స్థాపన, గణపతి, నవగ్రహ పూజలు వైభవంగా జరిపారు. భక్తులు పాల్గొని స్వామి సేవలో తరించారు. కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వినియోగదారుల అభిరుచి మేరకు వస్త్ర ఉత్పత్తి

శిక్షణ కేంద్రం ప్రారంభంలో చేనేత అధికారులు


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చేనేత కార్మికురాలు

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు అభిరుచి మేరకు వస్త్రాల ఉత్పత్తి జరగాలని, అప్పుడే డిమాండ్, గిట్టుబాటు ధరలు లభిస్తాయని విజయవాడ హ్యాండ్లూమ్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్ఞానశేఖర్ అన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో సోమవారం వెస్ట్ బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్ ట్రైనింగ్ సెంటర్‌ను శిక్షణ పొందేందుకు వచ్చిన చేనేత కార్మికురాలితో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ చేనేత కార్మికులు జాంధాని, జాకార్డు, కుప్పటం, మంగళగిరి, పట్టు రకాలలో శిక్షణ పొంది, ఆ రకాలను నేస్తే గిరాకీ ఉంటుందని సూచించారు. సెంటర్‌లో శిక్షణకు వచ్చిన వారికి 45 రోజులు శిక్షణ, రోజుకు ఒక్కొక్కరికి రూ.300 చొప్పున స్టయిఫండ్ చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్ అధికారి నాగమల్లేశ్వరరావు, జడ్పీటీసీ, మాజీ సభ్యుడు జీ చంద్రమౌళి, గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్, రిటైల్ ట్రేడ్‌పై విద్యార్థులకు అవగాహన

చినగంజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులు చేయడం వలన ఉద్యోగ అవకాశాలు వస్తాయని, ఎస్ఎస్‌సీ బోర్డు ద్వారా పబ్లిక్ పరీక్ష కూడా ఉంటుందని పాఠశాల హెచ్ఎం ఎం.దేవదత్తం అన్నారు. పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులలో భాగంగా రిటైల్ ట్రేడ్, ఇండిస్ట్రియల్‌పై సోమవారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. వృత్తి విద్యా కోర్సుకు ఎంపికైన మొదటి బృందం విద్యార్థులు రిటైల్ ట్రేడ్‌పై అవగాహన కోసం సోపిరాల గేటు సెంటర్‌లోని ఎస్.మార్ట్‌ను సందర్శించారు. ఎస్.మార్టులో అమ్మకాలు, కస్టమర్ల సర్వీసు గురించి వృత్తి విద్యా కోర్సుల ఉపాధ్యాయుడు కోడూరి సుబ్రహ్మణ్యం, మోటుపల్లి రవిదేవరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వృత్తి విద్యా కోర్సులో భాగంగా రెండవ బృందం విద్యార్థులు ఉప్పుగుండూరు యూనియన్ బ్యాంక్‌ను సందర్శించారు. బ్యాంకింగ్ ఫైనాన్సియల్ సర్వీసు, ఇన్సూరెన్స్‌పై బ్యాంక్ మేనేజర్ ఎం.ప్రవీణ్‌కుమార్ బ్యాంక్ ఫారాలు, సర్వీసులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వృత్తి విద్యా కోర్సులకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం దేవదత్తం, ఉపాధ్యాయులు డి.నారాయణరెడ్డి, బి.నాగేశ్వరావు, ఏ.వీరాచారి, బి.చెంచురెడ్డి, పీడీ ఎం.అనిల్‌కుమార్, విద్యా కమిటీ ఛైర్మన్ ఎ.సుదర్శనరెడ్డి, రికార్డు అసిస్టెంట్ కుమార్‌లు అభినందించారు.